

అందినంత
చందమామ
(సోమసుందర్ సాహితీ సంస్పర్శ)
అవధానుల మణిబాబు


అందినంత చందమామ

(సోమసుందర్ సాహితీ సంస్పర్శ)



అవధానుల మణిబాబు

ANDINANTHA CHANDAMAMA..



By

Avadhanula Mani Babu, M.Sc., B.Ed.,

First Edition :

September, 2016

DTP & Printing at

Tirumala Publications

Kakinada. Cell : 9948598966

Price : Rs. 80/-

For Copies :

A. Sita Rama Lakshmi

D.No. 3-62, Near Bank of Maharastra,

Sarpavaram, Kakinada Rural, E.G. Dist.

Andhra Pradesh - 533 005.

డా॥ ఆవంత్స సోమసుందర్
కళాకేళీనికేతన్, పిఠాపురం
సెల్ : 93478 48905

నిర్మల కరస్పర్శతో...

శ్రీ మణిబాబు ఎదురైన అవరోధాలన్నిటినీ పరాస్తంచేస్తూ, ఉత్సాహం జారవిడుచుకోకుండా సకల కళాసంపన్నంగా ఎదిగి వస్తున్నాడు. అతడు లోగడ ఒక సాహిత్య విమర్శా గ్రంథాన్ని, ఒక కవితా సంపుటినీ ప్రచురించాడు. గతానుగతికత్వం పోకార్చి, స్వీయ కవితాముద్రను ప్రకటించుకున్నాడు. ఇప్పుడీ పుస్తకంతో నూతన పరిధులు స్పర్శిస్తున్నాడు, స్థాపిస్తున్నాడు, సాధిస్తున్నాడు. నా కవితలపై వివిధ దృక్కోణాలతో విమర్శ రాశాడు కనుక నేను ఈ మాట చెప్పడంలేదు. అలాంటి అవసరం నాకు లేదు. కానీ, ఈ గ్రంథాన్ని పాఠకులందరితోపాటు నేను కూడా ఎలా ఆస్వాదించానో చెప్పి తీరాలి. కారణం, ఎవరి సాహిత్యం మీద వాళ్ళు ఏ విధమైన అంచనాలూ వేసుకోలేరు. వేరొకరు విపులీకరించినపుడే ఆ అభివ్యక్తులకు ప్రాముఖ్యత లభిస్తుంది. ఆలోచనలు ప్రసరిస్తాయి. ఔగాముల పరిశీలన మరోసారి కేంద్రీకృతమౌతుంది.

మణిబాబు ఈ గ్రంథాన్ని చాలా నిశితంగా రాసాడు. వాల్యూమ్ కోసం కాకుండా వేల్యూకోసం దృష్టి సారించాడు. అయితే చెప్పాల్సింది అంతా చెప్పాడా? ఇది ఎవరికి వారు శేషప్రశ్నగా భావించి మరొకసారి ఆలోచించాలి. ఈ గ్రంథానికి " అందినంత చందమామ " అని పేరు పెట్టడం చాలా హృద్యంగా ఉంది. ఎక్కడైనా కొంత క్లిష్టత, కొన్ని అభివ్యక్తుల అవరోధన కనిపించవచ్చు కానీ కొందరు ఆరోపించినట్లు నా కవిత్వం అందని చందమామ కాదు. అది సహృదయ పాఠకునికి ఆసాంతం ఆస్వాదయోగ్యమే. గగన తలంపై వ్యాపించిన సోమలతలు చేతికి అందకపోవచ్చు కానీ మనసునిండా మనోజ్ఞ భావాలసాంద్రతను నింపకపోవు. ఇది నన్ను నేను డిఫెండ్ చేసుకుంటూ చెప్పడంలేదు. ఆ బాబక్రమూ నాకు లేదు. నేను

చరమ దశలో మజిలీ వెదుకుతున్నవాణ్ణి. చాలా చదువుల బరువులు ఎత్తుకున్నవాణ్ణి. కవితా భావుకత్వంలో మునిగినవాడిని కనుక నన్ను ఆ శ్రేణికి దింపదలచిన వారి అభిప్రాయానికి ఇది సవరణ మాత్రమే.

సైకతతీరంలో స్వైరవిహారం చేయగా, చేయగా కాళ్ళు నొప్పులు పుడతాయి. ఇసుక గరగరలు పాదాలను తింటాయి. అంతమాత్రానికే విహారం విరమిస్తే ఎలా? కొనసాగిస్తే, కాసేపటికి ఏదో శక్తి దయతలచినట్లు, కడలి చెయ్యెత్తి పిలుస్తుంది. అక్కున చేర్చుకొని ఒళ్ళంతా నిమురుతుంది. గగుర్పాటును కలిగిస్తుంది. ఆకాశంవైపు తిరిగి అందుకోగలగాలి గానీ అపుడు అంతటి చందమామా అరచేతిలో అమరి పోతుంది. అందడం, అందకపోవడం కేవలం అభ్యాసానికి సంబంధించిన అంశాలు.

మణిబాబుకి పరిశీలనా నైశిత్యం ఉంది. భావాభివ్యక్తీ ఉంది. అనుభవం, సమభావుకత్వం విడివిడిగా పెంపెసలారుతున్నాయి. కనుక భవిష్యత్తులో ఎన్నో పుస్తకాలు రాయాలని మనసారా కోరుతున్నాను. ఈ గ్రంథము, శీర్షిక నాకెంతగానో నచ్చాయి. అందుకే అక్కున చేర్చుకొని, లౌక్యము, ధ్వనీ లేకుండా నిర్మల కరస్పర్శతో అభినందిస్తున్నాను.

పిఠాపురం,
ది. 11-07-2016.

- డా॥ ఆవంత్స సోమసుందర్

శ్రీ మాకినీడి సూర్యభాస్కర్
కాకినాడ
సెల్ : 94915 04045

సుందర బంధురం 'అందినంత చందమామ'

సప్త వ్యాస సంకలితం – పడుతున్న సన్న తుంపర, వెనుక ఆకాశంలో మెరుస్తున్న 'చందమామ'ను ప్రతిఫలించుకుని సప్త వర్ణ సంభరితంగా వెలిగే 'చంద్ర ధనువు'ను ఆవిష్కరించిన వ్యాససంపుటి 'అందినంత చందమామ'.

కవితాకాశంలో మెరుస్తున్న చందమామ శ్రీ సోమసుందర్. తన అక్షరాల్లో కనబడని చంద్రధనువును నిర్మించి, వారధిగా చేసి, వారి కవితా పరీమళాన్ని, భాషా సౌందర్యాన్ని పాఠకుల ఎదలోతుల్లోకి పాతుకుపోయేలా ఏడు వ్యాసాల సంపుటిని రచించిన చి॥ అవధానుల మణిబాబు ధనూనిర్మాత.

కవితాకాశమనే అనంతాబ్ధిలో నిరంతరం సంగమిస్తూ...న్న కవిచంద్రులు శ్రీ సోమసుందర్. శతాధిక గ్రంథకర్త అయిన వీరి సాహిత్యాన్ని చదవాలంటే ఒక జన్మ సరిపోదు. అయినా వర్ధమాన కవులను, విమర్శకులను; తల్లి తన పిల్లల తప్పిదాలను భరించినట్లు సహించి ప్రేమించగల మాతృహృదయం వారిది. ఈ లక్షణం స్త్రీలకు సహజాతమైనా దానిని సొంతం చేసుకునే పురుషులూ కొందరుంటారు, అమ్మల్లాంటి నాన్నలు. అటువంటి పురుష పురటాలు, నిత్య కవితా ప్రాసవ ప్రాసాదం డా॥ ఆవంత్స సోమసుందర్.

సోమసుందర్ గారి శతాధిక గ్రంథాల నుంచి తనకు నచ్చిన కొన్నింటిని తీసుకుని అధ్యయించి, ద్రవించి వ్యాసాలు రాయడానికి ఉద్యమించి, ఇపుడు సంపుటిగా మన ముందుకు తెచ్చారు మణిబాబు. అవసరమైనచోట్ల "ఒకింత లోతుగా అధ్యయనం చేసి, కవితో ఇతర సందర్భాలలో చేసిన సంభాషణలలో గుర్తించిన వారి ఆంతర్యాన్ని" గుర్తు చేసుకుంటూ, అనుసంధానిస్తూ తన వ్యాసాలను రాశారు. చాలా చోట్ల తన పరిశీలనలను గడుసుగా ప్రతిపాదిస్తారు. "ప్రధానవస్తు కేంద్రంగానే గమనం సాగినా పరిధి దాటిన సంచారం పాఠకుడిని ఒకింత Confusion గురి చేస్తుందం"టూ, అప్పుడు, "ఇంతకీ ఏదో చెప్పాలని ప్రారంభించి ఏదేదో చెప్పుకుంటూపోతున్నాను

కదూ" అని కవి రాసే వాక్యం అనాలోచితంగా కాక మనఃపూర్వకంగానే చేశారనడానికి సాక్ష్యమిస్తుందంటారు. అలాగే మరోచోట, "మనసులో కలిగిన అభిప్రాయాలను ఎవరి ప్రీతికోసమో వదలలేని బలహీనత నాది" అని సోమసుందర్ గారు రాసుకున్నా, తన బలహీనత తెలుసుకోగలగడంకన్నా బలమేముంటుందని ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నించడంలో సోమసుందర్‌గారితో తాను ఏకీభవించిన విషయాన్ని బలంగా చెబుతూనే, అంతకంటే గడుసుగా ఒక Negative approachని Positive గా మలచి చెప్పడం చూస్తాం. ఈయన విమర్శలో ఇదొక మెచ్చదగ్గ అంశంగా నాకనిపించింది.

కవి, తన అభివృద్ధికెంతో దోహదపడిన శ్రీ సూర్యారాయ విద్యానంద గ్రంథాలయాన్ని తలచుకుని, దాని జ్ఞాపకాలనొక దీర్ఘకవితగా అల్లారు. అదే 'గంధమాదనం'. అలాగే, 'మళ్ళీ మరణించిన మహాత్ముడు' అంటూ, వావిలాల గోపాలకృష్ణయ్య గారి స్మృతులను మరో దీర్ఘకవితగా అల్లారు. రెండూ సంస్మరణ కావ్యాలే. ఈ రెంటిమీదా రెండు వ్యాసాలున్నాయి ఈ గ్రంథంలో. రెండూ బావున్నాయి. అయితే రెండోది రెట్టింపుగా బావుందనిపించింది, కదిలించింది. కారణం బహుశా, కవి బాగా కరిగి అక్షరంగా కదిలిన కావ్యం కావడమేమో! మొదటి కవితలో వస్తువు నిర్జీవమైనది. కానీ జీవితాలను చైతన్యమయం చేసే గ్రంథాలయం. రెండో కవితలో వస్తువు సజీవ చైతన్య స్ఫూర్తి. వస్తువులు రెండూ చైతన్యాన్ని కలిగించేవే అయినా, ఈ భేదం కలగడానికి కారణం మానవీయాంశమై ఉంటుందనిపించింది.

ముందుగా అల్లంత దూరంనుంచే చిరు హిమహాసాన్ని పంపించి, చేరువౌతూనే మాటలహాసంతో పలకరిస్తారు మణిబాబు. మొహం మీద ఎప్పుడూ మంద హాసాన్ని అలంకారంగా ధరించే అలంకార ప్రియుడు. నిజం, అలంకార ప్రియుడు. అందుకే, అవకాశం వచ్చినప్పుడల్లా, ఆయా కవితల్లో దొర్లిన విలక్షణ అలంకారాలను వివరించక మానరు. ఆ విధంగా శ్రీ సోమసుందర్ కవిత్వంలోని ప్రతీప, అపహ్నవ, ఉల్లేఖాలంకారాలను ఉల్లేఖిస్తారు.

"మరో సో.సు.ని చూపే మనస్సంగీతం" అనే వ్యాసాన్ని ప్రారంభిస్తూ, ఉపోద్ఘాతంగా రూమీ వాక్యాన్ని ఉటంకించి, "వ్యక్తికి తాను నడిచే మార్గంపట్ల అపరిమిత గౌరవం, అచంచల విశ్వాసం ఉన్నా, ఆ మార్గంలో ఎదురుపడనివి, తనలోనే దాగివుండి బహిర్గతమయ్యేందుకు ఎల్లప్పుడూ ఎదురు చూసేవి అయిన కొన్ని భావాలుంటాయి. అయితే, ఈ నిరీక్షణ కేవలం భావాలదేనా? తనతో తాను తన్మయమొందే క్షణాల కోసం ఎవరు పరితపించరు?" అంటూ స్వగతంగా ప్రశ్నిస్తారు.

ఇటువంటి వాక్యాలు చదివినప్పుడు, ఈ తాత్త్వికభావ సంచయం ఈ అబ్బాయికి ఎక్కడి నుండి అబ్బిందనిపిస్తుంది. ఆశ్చర్యం వేస్తుంది. మణిబాబు విమర్శ, అనుభూతి విమర్శ కావడంవల్ల అది పాఠకుడి మనసులో విమర్శనానుభూతిని పూయిస్తుంది.

"లఘుకవితా రూపంగా సుదీర్ఘ జీవన సారం – 'చంద్రభాగ' అనే వ్యాసంలో ఉటంకించిన సోమసుందర్ కవితాపంక్తులు గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. "శాపగ్రస్తుల (పేదల) గృహాలన్నీ భూమి ముఖం మీద స్ఫోటకపు మచ్చలు"గా కనిపిస్తాయంటారు కవి. ఈ వాక్యాన్ని వివరించడానికి ఉపోద్ఘాతంగా, సమకాలీన స్థితిలో కవికి భువనమంతా నిండిన క్రౌర్యాన్ని ప్రతిబింబించే దర్పణంగా గగనం గోచరిస్తుందని ప్రతిపాదిస్తారు. ఈ ప్రతిపాదనకు భూమికగా "ప్రకృతితో మమేకమైన కవి, తన వైయక్తిక అనుభూతులన్నిటినీ ఆ ప్రకృతిలోనే దర్శించగలుగుతారనడానికి, మృచ్ఛకటికంలోని శ్లోకాన్నొకదాన్ని వక్కాణిస్తారు. ఈ విధంగా అవసరమనుకున్న తావుల్లో పూర్వపు పద్యాల్ని, ఆంగ్లం నుంచి కొన్ని ఉటంకింపుల్ని ప్రయోగిస్తూ, 'పండిత విమర్శకుడు'గా అనిపిస్తారు. ఇంతకీ ఏదో చెప్పాలని ప్రారంభించి ఏదేదో చెప్పుకుంటూ పోతున్నాను. ప్రస్తుతాంశం మనది, సోమసుందర్ కవితానుభూతి కదూ! ఈ పంక్తుల్ని చూడండి, ఎంతటి సామాజిక స్పృహను, అంతకు మించిన అనుభూతిని గర్భీకరించుకున్నాయో!

"రెక్కలచేప ఎగురుదామనుకుంది
పొంచిన పక్షి వాడిగా చూస్తోంది
నీటి లోతులకు పోదామనుకుంది
పెద్ద చేప ఆకలిగా వస్తోంది"
"చెదపురుగులు జ్ఞానం కోసం తినవు పుస్తకాలు
ధనికుల అన్నదానం జీవకారుణ్యం కాదు"
"పేరులేని పిట్ట తీయని పాటలు వినిపిస్తోంది
ప్రాధాన్యత పేరుకా? పాటకా? "

ఈ చివరి కవితను సోమసుందర్ గారి వ్యక్తిత్వానికి ఆపాదించి చెప్పడం బావుంది. సోమసుందర్‌గారి దృష్టిలో సాహిత్య కృషి ఓ నిష్కామ కర్మ. మరేదో లక్ష్యసిద్ధి కోసం కవిత్వాన్ని ఉపకరణంగా వాడుకోవడం దోషం. అవార్డులు, బిరుదులు ప్రాచుర్యాన్ని కలిగిస్తాయిగానీ, రచనలకు శాశ్వతత్వాన్ని సిద్ధింపజేయవు. ఈ సత్యాన్ని వర్ధమాన కవులు బాగా అర్థం చేసుకోవాలి.

"బాకు మొన కన్నీరు కార్చదు"
"పెద్దపులి లేడి అందానికి మురిసిపోదు"
"పూల దండ ధరించాలంటే తల వంచక తప్పదు"
వజ్రాయుధం పదును ఏ అదనులోనూ తగ్గలేదని నిరూపించే సాక్షర సాధికారత !

ఈ పుస్తకం రాయడానికి సంకల్పించకముందే సోమసుందరులను ప్రశ్నించి 'ఇన్నర్ వ్యూ'ను అర్థం చేసుకున్నారు రచయిత. "కళాకేళి"లో కాసేపు" అన్న వ్యాసం, ఆయనతో చేసిన ఇంటర్వ్యూ ఆధారంగా రాసినది. ఈ వ్యాసంలో సోమసుందర్ రచనాతాత్త్వికత ఏమిటో బాగా తెలుస్తుంది. భావితరాలకు అందని భాషాసౌందర్యాన్ని సోమసుందర్ గారి కవిత్వం నుంచి పట్టి చూపిన వైనం బాగుంది. కవి-సంస్కారం గురించి, కవి సామాజిక బాధ్యత గురించి సోమసుందర్ చెప్పిన విషయాలు సదా స్మరింపదగినవి. ఈ నేపథ్యంతో ఆయన కవిత్వాన్ని పరిచయం చేశారు రచయిత.

మనస్సంగీతం వ్యాసంలో "పద సరళత - ఈ ఒక్క లక్షణం మిగిలిన సోమసుందర్ సాహిత్యం నుండి ఈ గీతాలను వేరుచేస్తుంది. అధిక శాతం సారళ్యంతో నిండి, పాటలన్నీ పాఠకుడిని పదే పదే పాడుకునేలా చేస్తా"యంటారు. ఈ రీత్యా తక్కిన కావ్యాల్లో అందరికీ అందని చందమామ సోమసుందర్. అందని మామే, కానీ అందరి మామ - చందమామ. అటువంటి చందమామను, ఆయన కవిత్వంలో చాలా పదాల అర్థాలు తనకు తెలియపోయినా, కవిత్వమంటే ఉన్న అనురక్తితో తనకు 'అందినంత' మేరకు పరిచయం చేసే ప్రయత్నం ఈ గ్రంథమని వినయంగా చెప్పుకున్న 'చిన్నారి చందమామ' మన మణిబాబు, సోమసుందర్ కవిత్వాన్ని 'అద్దంలో చందమామ'లా సమగ్రసరళిలోనే పరిచయం చేశానరక తప్పదు. "అర్థమైనవే చదవండి. అందులో అర్థమైనంత వ్రాయం"డన్న సోమసుందర్‌గారి ప్రోత్సాహం అందుకు కారణమని చెప్పక తప్పదు.

తనకు అందినంత మేరకు చందమామను సుందర బంధురం చేసిన మణిబాబుకు అభినందనలు.

కాకినాడ,
ది. 15-07-2016 (తొలి ఏకాదశి).

- మాకినీడి సూర్యభాస్కర్

నావో రెండు మాటలు...

. 1 .

ఊహ తెలిసేనాటికి మా నాన్నగారి ఉద్యోగరీత్యా ఉప్పాడ దగ్గర మూలపేటలో ఉండేవాళ్ళం. ప్రతి పర్వదినాన అందరం కలిసి సముద్ర స్నానానికి వెళ్ళడం అప్పటి అలవాటు. నాలుగు రోజుల ముందునుంచీ బోలెడంత సంబరపడడం; తీరావెళ్ళాక, ఉవ్వెత్తున ఎగసిపడే అలలకు, ఘోషకు భయపడి అల్లంత దూరంలోనే నిలిచిపోవడం... కొన్నాళ్ళకు ఓ పెద్దాయన భుజాలపై కూర్చోబెట్టుకుని చాలా దూరం ముందుకి తీసుకెళ్ళి, కెరటాల మధ్య దింపి, చూడు ఏం భయం లేదన్నారు. అప్పటి నుండి కొన్ని వందలసార్లు అలలతో ఆప్యాయంగా ఆడుకున్నాను.

ఓ పాతికేళ్ళు గడిచాక ఇలాంటి అనుభవమే మరోసారి. కానీ ఇక్కడ సముద్రం డా॥ ఆవంత్స సోమసుందర్. నాకు అభయమిచ్చి, ఆ కవన జలధిలో విడిచిన పెద్ద మనుషులు డా॥ సీతారామస్వామి గారు, శ్రీ మన్మథరావు గారు. అందుకే ఆ సాగరానికి, వీరి సాన్నిహిత్యానికి........

శ్రీ మాకినీడి సూర్య భాస్కర్ గారు
డా॥ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు గారు,
శ్రీ గొట్టుముక్కుల వేంకట సత్య నరసింహశాస్త్రి గారు
డా॥ జోశ్యుల కృష్ణబాబు గారు
డా॥ ఉప్పలధడియం వేంకటేశ్వర గారు
శ్రీ తంత్రవహి శ్రీరామమూర్తి గారు
శ్రీ భగ్వాన్ గారు
శ్రీ బొల్లోజు బాబా గారు
శ్రీ కాకరపర్తి దుర్గా ప్రసాద్ గారు

వీరి మార్గదర్శనానికి....

శిరసా నమామి.

. 2 .


శ్రీ సోమసుందర్‌గారిని కలిసిన ప్రతీసారి వారి విమర్శలోనో, పుస్తక సమీక్షలోనో ఏదో విషయాన్ని ప్రస్తావించి మరిన్ని విషయాలు తెలుసుకోవడం, సందేహ నివృత్తి చేసుకోవడం... ఇలా కొన్నాళ్ళు నడిచింది. "ఎప్పుడూ విమర్శే కాదు, నా కవిత్వం చదవండి, వాటిపై మీ అభిప్రాయం చెప్పండి, అది ఎక్కువ ఆనందం నాకు" అన్నారోసారి. ఒకటి రెండు సార్లు తప్పించుకున్నా, ఇక తప్పక "మీ కవిత్వంలో చాలా పదాల అర్థాలు నాకు తెలియడం లేదు, నాకు కవిత్వమంటే అనురక్తి. కానీ భాష పరంగా అధ్యయనం తక్కువ" అన్నాను.

"మీ తరం అంతా అలా అనుకొంటే నేను రాసిందంతా పితృ దేవతలకా? అర్థమైనవే చదవండి. అందులో అర్థమైనంత వ్రాయండి. నావన్నీ ఇపుడు నేను చదువుకోలేను. మీరు సమీక్షలు వ్రాస్తే కొన్నయినా మరోసారి గుర్తు చేసుకొంటాను" – ఇది వారి ఆత్మీయమైన కోరిక.

దాని ఫలితమే ఈ **"అందినంత చందమామ".**

– అవధానుల మణిబాబు

ఈ క్రమంలో...



జగతికి సాక్షర "రక్షరేఖ"

రెండు ప్రపంచయుద్ధాలు, అనంతర పరిణామాలు – ఆధునిక నాగరికత ఆరంభం నుండి చరిత్ర ఎరుగని మారణకాండతో ఇరవైయవ శతాబ్దపు భూగోళం చుట్టూ కమురుకంపు కమ్ముకొంది. ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం భౌతిక శాస్త్రాన్ని, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ మనస్తత్త్వశాస్త్రాన్ని వికాసమొనరించినా విజ్ఞాన వృద్ధి మానవజాతి వినాశహేతువే అయింది. ఇపుడు ప్రపంచపు ప్రతిభాగం రక్త పరీవాహక ప్రాంతమే. 1995 ఆగష్టులో భద్రతాసమితి "గడిచిన ఏభై సంవత్సరాలలో వలసవాదులు జరిపిన స్థానిక యుద్ధాలలో మరణించిన వారి సంఖ్య రెండవ ప్రపంచ యుద్ధంలో చంపబడిన వారికి సరిగ్గా రెట్టింపు" అని ప్రకటించింది. స్వాప్నికునిగా సుందర లోకాల్లో విహరిస్తున్న సృజనశీలిలో ఈ వార్త కలిగించిన మనోవేదనకు ప్రతిస్పందనే ఈ గ్రంథం.

అయితే, కావ్యనిర్మాణం ఆవేదన ఆవిష్కరణకు మాధ్యమమే తప్ప హృదయ ప్రశాంత సాధనకు ఉపకరణం కాదుకదా! ఈ సమయంలో కవికి తన బాల్యం గుర్తొచ్చింది. తనకే కీడూ వాటిల్లకుండా అమ్మ 'రక్ష' కట్టడం స్ఫురించింది. అందుకే, 'సర్వే భద్రాణి పశ్యంతు' అని ఆకాంక్షిస్తున్న కవి తానుగా ప్రపంచానికి అక్షర రక్షరేఖనందజేయాలని సంకల్పించాడు.

కావ్య నిర్మాణం జరిగిన (1990-1995) నాటి దేశ స్థితిని పరికిస్తే, ఆ అర్ధ దశాబ్దంలోనే నాటి మాజీ ప్రధాని రాజీవ్ హత్య, దేశవ్యాప్తంగా పలుచోట్ల వరదలు, తుఫాన్లు, లక్నోలో దాడులు, ఇటు దక్షిణాన వీరప్పన్ దురాగతాలు, అటు అయోధ్య అల్లర్లు, బొంబాయ్ పేలుళ్లు, అందాల పోటీలలో భారత సుందరీమణుల విజయం - ఇలా వివిధ రంగాలలో ప్రభావవంతమైన అంశాలు చోటుచేసుకున్నాయి. ప్రత్యక్షంగా కళ్ళముందు కదలిపోతున్నవి కొన్ని, మాధ్యమాల ద్వారా వెల్లడవుతున్న ప్రాపంచిక సత్యాలు మరికొన్ని - కవిని చుట్టుముట్టి కలతకు గురిచేసాయి. అందుకే **"ఇది చిత్ర కవిత్వం కాదు తమ్ముడూ - జీవన కవితా చిత్రణమే"** అంటూ ఊహకు రూపమియ్యడమే కాక అనుదిన సత్యాలనూ చాటాల్సిన కవిత్వవిధిని నిర్వర్తింపజేసారు.

* * *

భావ జగతిలో తానూహించిన సౌందర్యాన్ని ఎంత వెతికినా భూతలంపై ఇసుమంతైనా దర్శించలేకపోయాడు కవి. **"వసుంధరా వక్ష స్థలమంతా చీరికలు, నెత్తుటి చారికలు". "కోమల కపోలపాళిని కశ్మల మొనరించే అశ్రుధారా ప్రవాహాలు"** వీటిని చూసి భయకంపితుడవుతాడు. సేద తీరేందుకు, ఎదురైన శ్వేత సౌధాలను ఆశ్రయిస్తే, అవి భవంతులు కావు, **"శతాబ్దం పొడుగునా దురాక్రమణదారులు గుట్టలుగా పేర్చిన అస్థిపంజరాలు"**. **సౌమనస్య సుందర పరిమళ స్నేహలహరుల కోసం, సామరస్య మార్దవ ప్రశాంత సంగీత మాధురుల కోసం** తన అన్వేషణ. కానీ, స్వాగతిస్తున్నవి **నిష్కరుణావహ రక్తరేఖలు.** ఈ వైరుధ్యం అతడిని విస్మయపరుస్తుంది.

పరిమిత శోధనతోనే మనిషిలో "ఆదిమత్వం" అంతర్లీనంగా నేటికీ ప్రవహిస్తూనే ఉందని ప్రతిపాదించుకొంటాడు. నరుల నరాల్లో పారదర్శకంగా ఆ ఆదిమత్వ అస్తిత్వాన్ని చూసి తన భావన రూఢిచేసుకొంటాడు. **"శ్రేణులుగా ఎదురవుతున్న దుష్పరిణామాల నుంచి గుణపాఠం నేర్చుకొనక కొనసాగిస్తున్న పునరావృత దోషాల ఫలితమైన జననాంతర క్లేశాలు"** ను గుర్తు చేస్తాడు.

తరువాత దశలో, తనకు దొరకని సమాధానాల కోసం పాఠకులను ప్రశ్నిస్తాడు కవి. ఈ ప్రచ్ఛన్న హత్యా సహస్రాలకు జవాబుదారీ ఎవరని? నయవంచకులతో నిండిపోయిన ప్రపంచంలో ఎవరు బాధితులో ఎవరు బాధకులో తెలుసుకోలేని ఒక సందిగ్ధ అవస్థలో ఉన్నామంటాడు. ఈ వ్యక్తీకరణ ఒకింత చమత్కారంగా సాగుతుంది. సినిమాల్లో విస్పష్ట వేషాలలో విలన్లు ప్రత్యేకంగా కనబడినట్టు నిజ జీవితంలో సాధ్యపడదంటాడు. **"ఇక్కడ అందరూ అద్భుతమైన సూట్లలో అందంగా మెరిసే గంధర్వులే అందరూ మణికంధరులే; అందుకే ఎవరిని బోనులో నిలిపి ఎవరిని దండించాలి"** అని వాపోతూ ఇవన్నీ అర్థమయ్యే స్థాయిలో మన చిత్తదీప్తి స్వయంప్రకాశ మయ్యేదెపుడో అని నిట్టూరుస్తాడు.

ఒకనాటి 'బొంబాయ్'ని తలుచుకోగానే, రస హృదయంలో నింపుకున్న జ్ఞాపకాలను స్మరిస్తూ **"సాగరవేలా సైకత తీరం, సాయం సంధ్యా సమరస దృశ్యం, విశాల సాగర విలోల ఖేలన, పశ్చిమ దిగంత రేఖల లాలన"** అని పారవశ్యంగా పలవరిస్తున్న కవికి మెలకువలో స్మగ్లర్లు, గాంగ్‌లు, సినీ మాఫియా..... నేటి స్థితి కన్నులెదుట నాట్యం చేస్తోంది. ఈ మార్పుని ఏదో రేఖామాత్రంగా స్పృశించి విడిచి పెట్టకుండా ఈ దీర్ఘకవితలో కాస్త సుదీర్ఘంగానే చర్చిస్తారు. బహుశా 1995వ సం॥లో రాజకీయ మార్పులు, బొంబాయ్ ముంబాయ్‌గా పేరు మార్చుకోవడం, వ్యాస ఆరంభంలో పేర్కొన్న ఇతర పరిణామాలు – ఇవన్నీ కవితా నిర్మాణ సమయంలో కవి మనసును చుట్టు ముట్టి 'బొంబాయి' అధిక ప్రాధాన్యతను సంతరించుకోవడానికి కారణం కావచ్చు.

అయితే, ప్రతి దశలోనూ తన అంతస్తాపాన్ని అక్షరీకరించే క్రమంలో 'రచన' సౌందర్య విస్మరణకు గురికాకుండా ఎంతో జాగరుకుడై ఉన్నాడు కవి. **"కులాల కూట నీతులకు హిమాలయాలు రక్షక భటులు"** - అనే వాక్యంలో ఎంత తీవ్రత నిక్షిప్తమయిందో? తాత్త్వికవివేచన లేని మనిషి, విజయం పొందాలనే ఏకైక కాంక్షతో తాను మాత్రం శాశ్వతుడననే భ్రమలోనే జీవిస్తున్నాడు. **సకల జీవ విజేత-మరణం ఒక్కటే** అనే సత్యాన్ని విస్మరించాడు. ఈ మానవ మానసిక విన్యాసాన్ని 'ఆరణ్యక చిత్త వృత్తి' అని ఒక్క పదబంధంలో సాంద్రీకరిస్తారు శ్రీ సోమసుందర్. సి.నా.రె., కృష్ణశాస్త్రి కవిత్వాన్ని గురించి 'వలాహక ఘోష వాక్యంలో ఇమిడింది, సాగరం అక్షరంలోనికి చొరబడింది' అన్నట్లు వాక్యంలో ఇమిడిన వలాహక ఘోషలు, అక్షరమైన సాగరాలు - వినడానికి, కనడానికి ఎన్ని అవకాశాలో ఈ కావ్యంలో.

నామచవాక, విశేషణాలను వ్యక్తి లక్షణాలతో సరిపోల్చి అవి సార్థకాలా, కాదా? అని తేల్చడం మన అలవాటు. పైన దృశ్యమానం చేసిన ప్రపంచాన్ని 'వసుమతి'గ కీర్తించలేనంటాడు, కవి. **ఈ మట్టిదిబ్బను కాశ్యపిగా, ఈ ఎముకల ప్రోగును రత్న గర్భగా పిలువలేనంటాడు. ఇవన్నీ ఒట్టి దొంగపేర్లని సాహసంగా విమర్శిస్తాడు. సహస్ర మానవతులు మైథిలీ సదృశ సీతమ్మలు దినం దినం నా దేశంలో చితాభస్మ రాశులుగా మారుతున్నపుడు, పసిబిడ్డల నవనీత హృదయాలు కంటినిండా కమ్మని నిద్రపోలేనప్పుడు, ఈ దేశంలో తాను సలలిత దీపకాంతిగా సౌజన్యం విరుస్తుందని స్వప్నించలేనంటాడు.**

క్రమానుగత హెచ్చుతగ్గులను వర్ణించడానికి సమరూప అంశంతో సాదృశ్యం కల్పించడం ఓ కవితా నిర్మాణ విశేషం. అందుకే వర్ణించదలచిన స్థితి తీవ్రతకు ప్రతీకగా ఎండను ఎంచుకున్నాడు కవి. మనిషిలోని అమానవీయత్వంతో పాటు పెరుగుతున్న వేడిమిని భరించలేని కవి **'ఈ భూమి కఠోరచిత్తానికి సాయంగా, ఈ విమూఢ కృత్యాలకు తోడుగా, ఈ నిరంకుశ నియంత, నిరంతర సనాతనుడు, సూర్యుడి మాయాతాపం రెట్టించేను"** అంటూ ఎండను ముమ్మారు తలుచుకొంటూ

మూడు మార్పులతో అసహనంతో ఉచ్చరిస్తాడు. ఏండ, ఎంథ, హెండ – అని. లోకాన్ని ధ్వంసధూళిగా మార్చాలనే మత్సరాగ్నుల రాజేసే విద్వేషాన్ని, మనిషి గుండెలో దాగిన ఆదిమ పాశవిక జడత్వాన్ని, మూఢత్వాన్ని **'తాత్త్విక చింతా రహిత జాంతవ వారసత్వాన్ని పరిపోషిస్తూ మనిషినే భస్మీపటలం చేసే తంత్రభీతి'**ని ఎండగడతాడు. సంవత్సరమంతా ఋతువులతో సంబంధం లేకుండా ఇలా ఎండ ఒక్కటే విలయం సృష్టిస్తుంటే ఇంక చైత్రమా, వైశాఖమా, వసంతమా? మలయ మారుతమా... ఇన్ని ప్రాకృతిక శోభలు, పరివర్తనలు చూడలేని దౌర్భాగ్యులమంటాడు.

* * *

అయితే, ఈ దీర్ఘ కవితను అర్థం చేసుకునే ప్రయత్నంలో ఎదురైన సందేహాలలో ప్రధానమైనవి రెండు. ఒకటి "ఆధునిక తెలుగు కవిత్వాన్ని, పరిణామాన్ని ఆది నుండీ అత్యంత చేరువగా పరిశీలించి, ఆంగ్ల సాహిత్యాన్ని హృదయస్థం చేసుకొని, అభ్యుదయ భావజాలంతో రచనలు చేసిన శాస్త్రీయ దృక్పథం గల సోమసుందర్; నేటి సమాజంలో కొందరు మూఢ విశ్వాసంగా భావించే 'రక్ష రేఖ' కట్టడమనే నేపథ్యంతో కవితా నిర్మాణం చేయడం, దానినే కావ్య నామంగా ఉంచడం. రెండవది, తన ముందుమాటలో ప్రాపంచిక సమస్యలను, మార్పులను ఏకరవుపెట్టి తత్ఫలితమైన ఆవేదనకు అక్షర రూపంగా తలపెట్టిన ఈ కావ్యంలో భారతదేశ స్థితిగతులు తప్ప ఇతర ప్రపంచం అంతగా కనపడకపోవడం.

అయితే ఒకింత లోతుగా అధ్యయనం చేసి, కవితో ఇతర సందర్భాలలో చేసిన సంభాషణలలో గుర్తించిన వారి అంతర్యం ఇది – అపరిమితమైన వాత్సల్యంతో ఏర్పడిన భయం కొన్నిసార్లు మన జ్ఞానాన్ని మరుపుకు తెస్తుంది. లేదా మరుగు పరుస్తుంది. అందుకే, వైద్య విద్యనభ్యసించే విద్యార్థులు సైతం తల్లి దిష్టి తీస్తున్నా కాదనరు. ఇక్కడ విశ్వాసం యొక్క శాస్త్రీయత కంటే చెడు జరగరాదనే లక్ష్యమే జయిస్తుంది. కవి కూడా అంతే. మానవ జాతి శ్రేయస్సు కోసం మాతృ హృదయంతో తాను పడే ఆరాటమే 'రక్షరేఖ'. ఆ అగణితమైన అమ్మప్రేమ ముందు శాస్త్రీయ

వివేచన ప్రసక్తి అప్రస్తుతమే అవుతుంది. ఇక, రెండవ విషయానికి వస్తే, కవి విశ్వమంతటికీ ప్రతినిధి అయినా, తన చుట్టూ ఉన్న సమాజానికి, కాలానికి ప్రత్యక్ష సాక్షి. అందుకే "from known to unknown" సమీప సమాజాన్ని అర్థం చేసుకొని దానిని ప్రపంచానికంతటికీ అన్వయిస్తాడు.

మనిషికి విజ్ఞానం శిఖరాయమానంగా పెరుగుతున్న కొద్దీ అల్ప విషయాల గురించి అవగాహన శూన్యమవుతోంది. ఏర్పడ్డ ఈ శూన్యత స్థానంలో దానవత్వం చోటు చేసుకుంటోంది. అందుకే ఇంతటి వినాశనానికి కారణం మనిషిలో లోపిస్తున్న మానవత్వ శాతమే అని కవి నమ్మకం. ఈ విపత్కర స్థితిని **'ఇది పురాణ రాక్షసుల పునః ప్రవేశం'** అంటాడు. సంఘటితంగానే **'ఆధునిక చేతనాయత్త భారత భువిని సకల విశ్వాంతర శ్రీ సముజ్వల ఛవిని'** పునర్నిర్మించే లక్ష్యంవైపు కార్యోన్ముఖం చేస్తూ **'పాదరా తడబడక పాషాణములు పగుల'** అని చేతనత్వాన్ని నింపే ప్రయత్నం చేస్తాడు, ఎలుగెత్తి తాను **ఆధునిక జీవనోత్సవ తేజమిదు గీతినాలపిస్తూ...**

* * *

“ **(1996, జనవరిలో ప్రచురింపడిన “రక్షరేఖ” దీర్ఘ కావ్యం వారి చిరకాల మిత్రులు, అభ్యుదయవాది శ్రీ రవణం శ్రీరాములు గార్కి అంకితమీయబడింది. “ఈ వేకువ భీకర ముఖంతో” శీర్షికతో బొంబాయి అల్లర్ల నేపథ్యంలో 1993లో వ్రాసిన మరో కవిత ఈ గ్రంథంలో అనుబంధంగా ప్రచురింపబడింది.)** ”

సా(న్ని)హిత్య పరీమళం ‘గంధమాదనం’

"I have always imagined that paradise will be a kind of library" అంటాడు Jorge Luis Borges. నిజమే, సృజనజీవులకు సారస్వత సముదాయాన్ని మించిన స్వర్గమేముంటుంది? అందుకే, తనకు ఎందరో పురస్సరులను పరిచయం చేసి, నవ సరస్సులకు దారిచూపిన ‘శ్రీ సూర్యారాయ విద్యానంద గ్రంథాలయా’న్ని తలుచుకొని **“నేను పుడతానని తెలుసో, లేక పుట్టాలని ఆశించో నాకిప్పటికీ తెలియదు గానీ, నేను వీధుల్లో నడవడం నేర్చుకొనేసరికే సంసిద్ధంగా సకల సంపద్వంతంగా తెరుచుకుని నాకోసమే విద్యానందం”** వెలసిందని మురిసిపోతారు సోమసుందర్. గ్రంథాలయ పరిణామక్రమంతో పాటు స్వీయ పురోగతినీ సమాంతరంగా వివరిస్తూ, కృతజ్ఞతాపూరిత కవిత్వీకరణతో, పురాణ ప్రశస్తి గల ఓ పర్వతనామాన్ని ప్రతీకగా చేసుకొని సంస్థ వజ్రోత్సవ సందర్భంగా 1990 సం॥లో సృజించి ఆ సంస్థకి అంకితమిచ్చిన దీర్ఘకావ్యం “గంధమాదనం”.

దీర్ఘకవిత లక్షణాలుగా విమర్శకులు పేర్కొన్న 'గాఢ బంధానికి సంబంధించిన ఏక సూత్రత; రసాభివ్యక్తికి అవసరమైన నిర్మాణ చాతుర్యం' ఈ కావ్యంలో స్వయం సమగ్రంగా దర్శనమిస్తాయి.

* * *

జాతీయ పునరుజ్జీవనంలో భాగంగా గ్రంథాలయోద్యమం ప్రారంభమైన తొలినాళ్ళలో పిఠాపురంలో పౌరులంతా 1915లో దీనిని స్థాపించుకున్నారు. శ్రీ సోమసుందర్ 1939 సం॥ నుండి సంస్థ సభ్యులు. 1944లో శ్రీ చెలికాని భావనరావు ప్రధాన కార్యదర్శిగా, వీరు సహాయ కార్యదర్శిగా ఎన్నుకోబడి గ్రంథాలయానికి సొంతభవనం ఏర్పాటు చేయగలిగారు. నాటి నుండి నేటికీ ఆ అనుబంధం అలా అనుస్యూతంగా కొనసాగుతోంది.

* * *

పునాది నుండి పునర్వైభవం దాకా పాటుపడిన మహనీయుల సంస్మరణ ఈ కావ్యంలో కవి సాధించిన ఉపలబ్ధి. శ్రీ వేపూరి గోపాలదాసుని పరిచయం చేస్తూ **"ఈ గంధమాదన పర్వతానికి కెంపుల శిఖరంలా ఆ వ్యక్తి అక్కడుంటే చాలు పురాతన భవనం పునర్ యౌవనం పొందుతుంది. పాఠకుల నిటలాలపై అతని ఆగమనరేఖ చకచ్చకితమౌతుంది హరిచాపమై"** అంటూ అతని రాకకోసం పాఠకులు ఎదురు చూసేవారంటారు. అంతవరకే ఐతే విశేషమేముంది? సాక్షాత్తూ సరస్వతీదేవి, కదలాడే చిరునవ్వుల కెరటంలా ఆయన కనపడగానే తన దీనగాథలు విన్నవించుకుంటుందిట. **"ఏడవకు తల్లీ! సంగతేంటో చెప్పు అంటూ అతగాడు మెత్తగా లాలిస్తే చాలు - ఆమె మౌనం వహిస్తుంది. చప్పున ఫలానా తుంటరి తన చేలాంచలం పెరక చూసాడనో, మరో హీనుడు తన్నే అపహరించకాశాడనో వివరిస్తుంది మౌనంగా. అంతే, అతను బాసిపట్టం వేసుకుని కూర్చొంటాడు, పుటలు సవరిస్తాడు. పూడికలందిస్తాడు. చీలికలతికిస్తాడు, దిద్దుతాడు గ్రంథరాశికి సుగంధ తిలకం".** ఇలా గ్రంథాన్ని అచ్చంగా సరస్వతిగానే భావన చేస్తూ 'ప్రతీప అలంకార' నిర్మితమైన



వాక్యాలు పఠిత హృదయాలను మంత్రముగ్ధం చేస్తాయి. **"చీకటి పడ్డాక వారు గ్రంథాలయం విడిచాక మాత్రమే నిజమైన సూర్యాస్తమయం అవుతుంది"** అంటూ శ్రీ గోపాలదాసు ప్రభావాన్ని, ప్రాభవాన్ని పరాకాష్టగా వివరిస్తారు. తరువాత కాలంలో గ్రంథాలయానికి సేవలందించిన అల్లంరాజు శ్రీ రంగనాయకులు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, చెలికాని లత్సారావు, భావనరావు - ఇలా ప్రాంతాలకతీతంగా కృషి చేసిన వారందరికీ స్మృత్యంజలి సమర్పిస్తారు. హృదయ వైశాల్యము, రసజ్ఞతా సముపేతము గల ఈ మహావ్యక్తులు ఎక్కడ నిలిస్తే అక్కడ **'కాంచన రోచుల రింఛోళులే'** అంటూ వారి పావనత్వాన్ని ప్రస్తుతిస్తారు.

శ్రీ వేపూరి గోపాలదాసుగారిని, కుంతీ మాధవస్వామి కళ్యాణ సమయంలో రథోత్సవంలో గాంధీజీ పటంపెట్టి రథశిఖరానికి జెండాకట్టారన్న నేరానికి దేహమంతా తూట్లుపడేలా చితక బాదడం, భావనరావుగారు దురాక్రమణ దారుల నుండి కోర్టులో పోరాడి గ్రంథాలయాన్ని మళ్ళీ నిలిపి ఉద్ధరించడం లాంటి సన్నివేశాలు కథనాత్మక శైలిలో కావ్యంలో అంతర్భాగమై ఆ కాలపు చరితను, ఆ మనుషుల ఘనతను కొంత పరిచయం చేస్తాయి.

ఓ సమయంలో పర్యవేక్షణ లేక వ్యసనపరులకు ఆవాసంగా మారిన వైనాన్ని వివరిస్తూ **"మాజీ దేశ భక్తులు స్వాతంత్ర్యానంతరం ఇంక పనేమీ లేదనుకుని హాయిగా వినోదంగా పేకతో నిద్రిత ద్యూత హృదయాన్ని మేల్కొల్పారు. సప్త వ్యసనాలూ విడిగా బ్రతకలేవు"** అన్నప్పుడు, వాక్యంలో కవి వేదన వినపడకుండా చరుపులు చప్పుడు చేస్తాయి.

* * *

"నేనీ పురంలోనే పుట్టాను. ఇదే పురంధ్రీమతల్లి నన్ను పెంచింది. నాతో పాటే పెరిగిందీ పురం" అంటూ నగరంతో తాను తాదాత్మ్యం పొంది ఓ బిందువు వద్ద దాదాపు అద్వైత భావన కలిగిస్తారు. కేవలం గ్రంథాలయ సంబంధిత విషయాలనే కాక, పట్టణ సర్వతోముఖ విస్తరణ, దాని పర్యవసానాలు పేర్కొంటారు. **"ఇక్కడ**

గాలి ఈల పాటలు పాడుతుంది. ఊర్ధ్వ ముఖీనంగా వీణను నిలిపి, సంగమేశ్వర స్వరసంగీత లహరులలో ఉరకలెత్తుతుంది" అంటూ విశ్వకవి రవీంద్రుడినే పరవశింప చేసిన సంగమేశ్వర శాస్త్రిగారి పాండిత్యాన్ని స్మరిస్తూ తద్విరుద్ధమైన వర్తమానంలోకి వస్తారు. పరిసరమంతా **'చెరుకుబళ్ల కిర్రుకిర్రులతో ఒణికిపోతూ, కిటకిటలాడుతున్నాయి'** అంటారు షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణంతో వచ్చిన మార్పులను గుర్తుచేస్తూ, **"తీపి ఎవడిదో గానీ కాలిన దుమ్మంతా మాత్రం మా నగరానిదే. ఆల్కహాలికులెవరో తెలియదు గానీ మొలాసా కుళ్ళు వాసన మాత్రం మా నగర హాలికులదే"** ఇందులో 'తీపి ఎవడిదో గానీ' వంటి పద బంధాలు ధ్వనిమంతంగా కవి అంతస్తత్త్వాన్ని తెలియజేస్తాయి.

* * *

మరోచోట చిన్న చమత్కారం చేస్తారు కవి. ఈ పీఠికాపురాన ఎందరు మహనీయులు సారస్వత వ్యాప్తికి, దీప్తికి కృషి చేసినా విశేష కీర్తి నొందినది ఇద్దరే అని తేల్చి చెప్పి, అందు ఒకటి తన గురువు కృష్ణశాస్త్రి కాగా, రెండవది తానేనని స్వాభిమానంగా ప్రకటిస్తారు. ఇద్దరికీ జ్ఞానభిక్ష పెట్టినది ఈ గ్రంథాలయమే అని; అందుకే తాము గురుశిష్యులమైనా తల్లి ఒక్కతే అంటారు. సృష్టి అంతటికీ సూర్యుడు తండ్రి, చంద్రుడు మేనమామ అయినట్లు కవి పరంపర అంతటికీ ఆమె తల్లే అని గ్రంథాలయ మాతృత్వాన్ని సార్వజనీనం చేస్తారు.

* * *

అయితే, కొన్ని వైయక్తిక ప్రతిపాదనలను ప్రకటించే క్రమంలో, ఋజుమార్గపు భావ ప్రసరణలో కొన్నిమార్లు ఒకింత విచలనం చోటు చేసుకుంటుంది. ప్రధానవస్తు కేంద్రంగానే గమనం సాగినా పరిధి దాటిన సంచారం పాఠకుడిని ఒకింత confusion కి గురి చేస్తుంది. అప్పుడు, "ఇంతకీ ఏదో చెప్పాలని ప్రారంభించి ఏదేదో చెప్పుకుంటూ పోతున్నాను కదూ" అని కవి వ్రాసుకున్న వాక్యం ఇది అనాలోచితంగా కాక మనఃపూర్వకంగానే చేసారనడానికి సాక్ష్యమిస్తుంది. అవి నర్మగర్భంగా ఉండి,

ఇప్పటి మన మేధకు అందని అప్పటి విషయాలు కావచ్చు. కప్పి చెప్పడమేగా - కవిత్వం.

* * *

ఇంతటి సంపద పట్ల క్రొత్త తరానికి లక్ష్యం లేదని వాపోతారు కవి. **'నిరంతర వర్తమాన జీవులై పరుగులు తీస్తూ, గతమంటే ఏవగింపుతో, భవిష్యత్తు గురించి నిఘాలేక, నితాంత జీవన వర్తులాలలో తొందర తొందరగా పరిభ్రమిస్తున్నా'** రంటారు. **"చల్లని సరోవర జలాల నవలోకిస్తే చాలు - దాహార్తులు ఉపశమించినట్లు గ్రంథాలయ దర్శనంతోనే మనసు మూలాల దాగిన అజ్ఞాన తమస్సులు భయపడి ఒణికి పోనారంభిస్తాయి. ఆ సుందర స్వాప్నిక మందిరంలో సూక్ష్మాక్షర మనీషులు - కేవలానందామృత స్వరూపులు - పదవే, పద - వారి దర్శన భాగ్యంతో తరించు మనసా"** అని తన మనసును సంబోధిస్తూనే, మనకూ ఉద్బోధ చేస్తారు. "సుందర స్వాప్నిక మందిరంలో సూక్ష్మాక్షర మనీషులు" ఎంత గొప్ప వాక్యం. "A Library is thought in cold storage" అన్న Herbert Samuel మాటలు మొదటిసారి చదివినప్పటి సంబరం.

కవిత్వమంటే మరేమీ కాదు - కాలానికి కాపలా దీపం తప్ప అని పదే పదే ప్రకటించే సోమసుందర్; అలాంటి వేలాది వెలుగుల పాలపుంతగా ఈ గ్రంథాలయాన్ని అభివర్ణిస్తారు. ఇటు శతాధిక గ్రంథకర్త, అటు ఆ సృజనకు ప్రేరణనిచ్చిన గ్రంథనిధి; ఆలోచిస్తే సోమసుందర్, సూర్యారాయ విద్యానంద గ్రంథాలయం పరస్పర సంపూరకాలు అనాలనిపిస్తుంది.

సంస్మరణ కావ్యం

'మళ్ళీ మరణించిన మహాత్ముడు'

"ఖాది నూలు పంచె, కండువా, లాలిచి
చేత నూలు సంచి ప్రాతకాపు,
పతితజాతి హితుడు, పండిపోయిన వ్యక్తి
వక్త, కార్యకర్త వావిలాల" – ఇది కళాప్రపూర్ణ, పద్మభూషణ్ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారికి చందోలు ఆనందకవి అందజేసిన ప్రశంస. కేవలం నాలుగు పాదాల పద్యంలో వావిలాలవారి మూర్తిని, కీర్తిని యథాశక్తి పొందుపరచాలనే కవి ప్రయత్నంలో, కళ యొక్క అత్యున్నత లక్ష్యాలలో సంస్మరణ ఒకటని స్ఫురిస్తుంది.

ప్రతి కళాకారుడు జీవనదశలలో తనకు బాసటగా నిలిచినవారిని, బాటను చూపించిన వారిని తనకు అభినివేశం గల రంగంలోనికి అనువదించడం పరిపాటి; అందుకే శతాబ్దాల క్రిందట, ఈ నేలపై నడయాడిన మహనీయుల రూపాలను నేడు చిత్తరువులుగా చూడగలుగుతున్నాం. శిల్పాలు, పాటలు, మాటలు, హరికథలు, బుర్రకథలు – ఇలా ఒకటేమిటి దాదాపు ప్రతీ కళలో సంస్మరణ ఒక సంప్రదాయమైంది.



పై లక్ష్యసిద్ధి కోసం శ్రీ సోమసుందర్, వారికి ప్రాతస్మరణీయమైన వ్యక్తుల విశేషాలను గ్రంథస్థం చేసారు. వాటిలో ప్రముఖ బెంగాలీ కవి శ్రీ బుద్ధదేవ్ బోస్, లియోనార్డో డావెన్సీ, షెల్లీ, పిఠాపురం యువరాజా, కవితా భారతి (సుబ్రహ్మణ్య భారతి), హరిన్ చటో (హరీంద్రనాథ్ చటోపాధ్యాయ), చలం, రవీంద్రనాథ్ టాగోర్, కొండపల్లి జగన్నాథదాసు, కాజీ నజ్రుల్ ఇస్లాం, పాబ్లో నెరుడా, హెన్రిక్ హెయినే ప్రధానమైనవి. కానీ, ఆయా కవుల కావ్యానువాద భాగంలో తప్ప మిగిలిన గ్రంథమంతా వీటన్నిటా వచన రచనే కనబడుతుంది.

అయితే, పలు సందర్భాలలో వారి భావాలను వాత్సల్యంతో పంచుకున్న వావిలాల వారిపై గల అపరిమిత అనురాగం ఓ దీర్ఘకావ్యంగా వ్యక్తమైంది. 'స్మృతి' కేవలం సమాచార సమీకరణగా కాక వ్యక్తిత్వ విశేష ప్రధానంగా సాగింది. వావిలాల వారి శతజయంతిని పురస్కరించుకుని **'మళ్ళీ మరణించిన మహాత్ముడు'** శీర్షికన వ్రాసిన ఈ దీర్ఘ కవిత, 2006వ సం॥లో సంకలించిన **"క్షితిజ రేఖలు"** దీర్ఘకవితా సంపుటిలో లభిస్తోంది.

సన్నిహిత మిత్రులు కోరినపుడు **'నేనేం సాధించానని స్వీయ చరిత్ర రాయమంటావు?'** అని సున్నితంగా తిరస్కరించారుట గోపాలకృష్ణయ్య గారు. ఆ కేంద్రీకృత సహజలక్షణమైన నమ్రతే, వారిపై అగణిత గౌరవానికి కారణమైంది అంటారు సోమసుందర్.

ముందుగా పేర్కొన్నట్లు ఈ దీర్ఘకవిత వ్యక్తిగత సమాచారమీయక, వ్యక్తిత్వ విశేషాలతోనే నిండి ఉండడం వలన కవితలోనికి ప్రవేశించే ముందు గోపాలకృష్ణయ్య గారి జీవిత విశేషాలను కొన్నిటిని తెలుసుకోవడం అవసరం.

* * *

శ్రీ గోపాలకృష్ణయ్య గారు తేది 17-09-1906న గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లిలో జన్మించారు. విద్యార్థి దశ నుండీ గాంధీజీ ప్రేరణతో స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులై, అనేక ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. శ్రీ గార్లపాటి నరసింహారావుగారితో కలిసి పల్నాడు పుల్లరి సత్యాగ్రహాన్ని ముందుకు నడిపారు. 1925లో సత్తెనపల్లిలో 'శారదా నిలయం' పేరిట గ్రంథాలయం నెలకొల్పటమే కాకుండా, ఉద్యమంగా అనేక గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి శాసన సభ్యునిగా సత్తెనపల్లి నుండి ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. ఆ తరువాత పలుమార్లు స్వతంత్ర అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీవితాంతం గాంధేయవాదిగా కొనసాగిన వీరు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారికి అత్యంత సన్నిహితులు.

మాధ్యమిక స్థాయిలోనే విద్య ముగించినా, అమోఘమైన ధారణ వారి ప్రత్యేకత. 'ఆంధ్ర జాతీయోద్యమం, ఐక్యత వలన సత్ఫలితాలు, అభివృద్ధి ప్రణాళికలు, పరిపాలన భాషగా తెలుగు, బడ్జెట్, సమకాలీన సమాజం - మన కర్తవ్యం, కృష్ణా, గోదావరి జలాలు, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ" ఇలా అనేక అంశాలపై వీరి దర్శనం అద్భుతమైనది. ఆ కాలంలో వీరి బడ్జెట్ ప్రసంగాలు విశ్వ విద్యాలయ స్థాయి ఆచార్యులు, విద్యార్థులు ఎంతో శ్రద్ధగా వినేవారుట. "వావిలాల గోపాల కృష్ణయ్య ఆలోచనలు, ఆదర్శాలు" పేరిట ప్రస్తుతం వీరి ముఖ్యమైన ప్రసంగాలు, వ్యాసాల సంపుటి లభిస్తోంది. వీరు తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచన చేసారు.

ఇంతటి గంభీరమూర్తిలో చమత్కార కోణాన్ని శ్రీ టి.ఎస్.ఆర్.శాస్త్రి గారు ఓ సందర్భంలో తెలియజేస్తారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న రోజులవి. శాసనసభలో ఓ విషయమై సుదీర్ఘ చర్చ జరుగుతోంది. బ్రహ్మానందరెడ్డి గారు "గోపాలకృష్ణయ్య గారూ! మీరు చెబుతున్న విషయం అర్థవంతంగా లేదు. నేను ఒక చెవితో విని మరొక చెవితో వదిలిపెడుతున్నాను" అని ఒక చిన్న వ్యాఖ్య చేశారు. దానికి గోపాలకృష్ణయ్య గారు "ముఖ్యమంత్రి గారు నేను చెప్పినదంతా ఒక చెవితో విని మరొక చెవితో వదిలిపెడుతున్నారంటే, నాకొక అనుమానం. ఆ రెండు చెవుల మధ్య ఉండవలసిన 'బ్రహ్మ' పదార్థం లేని బట్టి 'ఆనందరెడ్డి' గారేమో మన ముఖ్యమంత్రి" అన్నారుట. ఈ ఛలోక్తికి సభలోని అందరితోపాటు బ్రహ్మానందరెడ్డి గారు కూడా నవ్వుకున్నారుట. బ్రహ్మానందరెడ్డి గారు వీరిని సరదాగా వావిలాల గోలకృష్ణయ్య గారు అని పిలిచేవారుట.

పత్రికా విలేఖరిగా జీవితం ప్రారంభించి, సుదీర్ఘమైన ప్రజా జీవిత ప్రస్థానంలో 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం కృషి, 1990లో మద్యనిషేధం.... ఇలా అనేక ఉద్యమాలలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి వీరు మొట్టమొదటి అధ్యక్షులుగా పనిచేసి, ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు భాషలో ఉత్తర ప్రత్యుత్తరములు జరిగేందుకు కృషి చేసారు. జీవనమంతా ప్రజల పక్షాన పోరాటానికే వినియోగించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు శ్రీ గోపాలకృష్ణయ్యగారు, వారి 96వ ఏట 20-04-2003న పరమపదించారు.

శ్రీ సోమసుందర్ నేరుగా గోపాలకృష్ణయ్యగారితో సంభాషిస్తున్నట్లుగా కవిత సాగుతుంది. వీరిద్దరి మధ్యా వయోభేదం సుమారు 18 సం॥లు. అందుకే గౌరవ పూర్వక ప్రేమతో భ్రాతా, మహాపవిత్రా! అనే సంబోధనతో కవితను ప్రారంభిస్తారు. **"నీవు జన్మించిన ఈ దేశాన్ని నిష్కంటకమొనర్చడమే జీవితమని, శ్రమించి దారి చూపించావు"** అంటూ దేశ పురోగమనానికి అవరోధంగా ఉన్న కంటకాలను, వాటి ఏరివేతే ధ్యేయంగా సాగిన వారి పథాన్ని, ధృక్పథాన్ని; పొందిన శ్రమ, అందించిన మార్గదర్శనం - ఇలా నాలుగు అసాధారణ లక్షణాంశాలను అలవోకగా పై వాక్యంలో నిక్షిప్తంచేస్తారు. ప్రగతి నిరోధకులని పరులెవ్వరినో నిందించనవసరం లేదని శతాబ్దాలుగా దేశ పౌరుల నిస్తేజమే ప్రతిబంధకమని కవి భావన. **"ఇన్నివేల మెదళ్ల నిష్ప్రాచీ నిష్క్రియత్వంవల్ల పరంపరగా ఈ దేశం ఎన్ని వోల్టుల శక్తిని కోల్పోయిందో వ్యర్థంగా"** అని పై భావనకు సమర్థనీయమైన భూమికనేర్పరుచుకుంటారు. మానవ జాతి క్రమానుగత పతనానికి ఆత్మ న్యూనతాభావనే అసలైన హేతువంటారు. సరిగ్గా ఆ విపత్కర సమయంలోనే అవతరించిన మరో మహాత్మునిగా గోపాలకృష్ణయ్య గారిని అభివర్ణిస్తారు. గీతలో "యధా యథాహి ధర్మస్య" అని భగవానుడు పేర్కొనినట్లు వారి జననంనాటి సమాజ స్థితిని **"మానుషత్వం బానిసత్వంగా మారి బుద్ధిమంతనం జడత్వంగా విపరిణామం చెందిన"** విషణ్ణ సమయంగా మననం చేసుకొంటారు.

"అమంత్ర మక్షరం నాస్తి, నాస్తి మూల మనౌషధం; అయోగ్య: పురుషో నాస్తి యోజక స్తత్ర దుర్లభ:" అనే శ్లోకం దిశానిర్దేశమందించగల యోజకుడు

లభించడమే అత్యంత దుర్లభమని పేర్కొంటుంది. దేశం పట్టనంత జనం ఉన్నా చేయగలిగిందేదో ఒక్కడికీ తెలియని స్థితిలో **"భ్రమకీ, ప్రమకీ నడుమ విభేదాలు విస్పష్టంగా కేటాయించి, బానిసను మనిషిగా మార్చడానికి, భక్తుని దేశభక్తునిగా తీర్చడానికి"** అవతరించిన మహితమూర్తిగా వావిలాల వారిని ప్రకటిస్తాడు కవి.

గోపాలకృష్ణయ్య గారి జీవితంలో అధికభాగం పర్యటనలోనే గడిచింది. యావత్ భారతదేశమే కాక 1952లో శాంతి సభలలో భారతదేశ ప్రతినిధిగా చైనా, రష్యాలలో పర్యటించారు. 1981 ఏప్రిల్‌లో మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొన్నారు. 1993 జూలై నెలలో అమెరికాలో జరిగిన తానా వార్షిక మహాసభలను ప్రారంభించారు. ఈ నిత్య పర్యటనా పరమావధి వారి అనుభవజనిత జ్ఞానసంపదను పంచిపెట్టడమే అని కవి యోచన. అందుకే, **"నిరంతర యాత్రా జీవనంతో దేశం నలుదిశలా పంచావు నీ శేముషీ కృషి"** అని శ్లాఘిస్తారు.

My life is my message అన్న మహాత్ముని జీవితాన్ని, నిర్మాణ కార్యక్రమాన్ని అడుగడుగునా ఆచరించిన ఆదర్శప్రాయులు వావిలాలవారు. మితమైన శాకాహారి. కాఫీ, టీ తాగేవారు కాదు. కిళ్ళీ, ఇస్త్రీ బట్టలు ఏనాడూ వేసుకోలేదు. ఉద్యమాల సమయంలో పర్యటనలో ఉన్నపుడు సామాన్యుల ఇండ్లలోనే ఉండి, వారు పెట్టిందే తినేవారు. అందుకే కవికి, భూత, వర్తమానాల్లో వీరికి సాటిరాగల మరో మహనీయుడు పోలికకు దొరకలేదు. ఓ చాటుపద్య కవి మల్కిభరాముని గురించి ఇలా అంటాడు :

రాజును రాజుగా డతడు రాహు ముఖంబున జిక్కె; వాహినీ
రాజును రాజుగా డతడు రామ శరాహతి దూలె దేవతా;
రాజును రాజుగా డతడు రావణ సూతికి నోడె నాజిలో;
రాజన రాజు మల్కి యిభరాముడె రాజు ధరాతలంబునన్!

ఇలా ఎవరితోనూ పోలిక లేదంటూ అసమానతను చిత్రించడాన్ని అపహ్నవ అలంకారం అంటాం. ఈ ప్రస్తావన ఎందుకంటే **"ఆరంభ యౌవనంలోనే**

సకల జీవన సౌరభాల్నీ హాయిగా ఆనందంగా ఈ దేశం కోసం నిరంతర దరహాసాల దక్షణతో సమర్పించిన ఏకైక కర్మయోగివి. పద్మ పత్ర మివాంభసకు సారమూర్తివి. త్యాగాల కర్థం తమ జీవితమేనని నిర్ధారించుకున్న ఏ మహనీయుని నీతో ఉపమించాలన్నా ఏదో వ్యత్యాసమే. ఏదో లోపమే, ఎలా సాదృశ్యం కుదురుతుంది" అని ప్రస్తుతిస్తాడు కవి. ఇక్కడ పద్మ పత్ర మివాంభసా అనే గీతావాక్యం వావిలాల వారికి అచ్చంగా అమరిపోతుంది. "నిరంతర దరహాసాల దక్షణతో" అనడం వారి స్వచ్ఛమైన సమర్పణా భావాన్ని మనకు అవగతం చేస్తుంది. మరొకచోట సోమసుందర్ **నీవు తన మార్గాన్ని అనుసరిస్తున్నావని తెలుసుకొని ఆ మహాత్ముడు ఎంత తృప్తి పొంది ఉంటాడో కదా!** అంటారు జాతిపితకు పుత్రోత్సాహాన్ని ఆపాదిస్తూ.

సుదీర్ఘ కాలప్రవంతిలో మహనీయులు అరుదుగానే అవతరిస్తారు. కొన్ని తరాలను ప్రభావితం చేసి, కొన్ని చరిత్ర పేజీలపై తమదైన ముద్రను వేసి కీర్తిశేషులవుతారు. ఈ విషయాన్ని కవి **"కాలం శూన్యంగా సాగనూలేదు. పుష్టిగా బతకనూ లేదు. మానవ జీవిత వ్యర్థ గాథల కట్టలతో సాగిపోతోంది"** అంటారు - కాలానికి పుష్టిని కూర్చే జీవితాలలో ఒకటిగా వావిలాల వారిని పేర్కొంటూ.

వీరేశలింగంగారి గురించి ఓ వ్యాసంలో శ్రీ కృష్ణశాస్త్రి "భయంకరమైన, తీవ్రాతితీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది. లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయుండేది" అంటారు. మరణించడానికి తీరిక లేదంటే తుదినిమిషం వరకూ వారు నిర్విరామ కార్యదీక్షను విడిచిపెట్టలేదని. సోమసుందర్ కూడా వావిలాల వారిని **"అసలంత బక్క శరీరం ఇన్ని ఏళ్ళ బరువును ఎలా లాక్కువచ్చిందో"** అంటారు - వారు మోసిన అంతులేని బాధ్యతల బరువును గర్తుచేస్తూ. అయితే ఇంతటి ఘనజీవితాన్ని సాగించిన మహనీయుడు దేహాన్ని విడువడానికి అది సరైన సమయం కాదంటారు కవి. తాతలు నిర్మించిన ధర్మసత్రాలు కళ్యాణ మండపాలై మనిషిలో వ్యాపార ప్రవృత్తి విశృంఖలమైన తరుణంలో, **జాతి నిర్వీర్యమై శిలీభవించిన సమయంలో,** ఇదా మీ ప్రయాణానికి **సమయం. పొరబాటు సుమా!** అంటారు. అశనిపాతం వలె మీ మహత్తర జీవయాత్ర

ముగించడం న్యాయమా అని వాపోతారు. **"నీవు ఒక కేక పెట్టి అడిగావనుకో ఎందరైనా తమ ఆయుర్దాయం నుంచి సంగోరు భాగమైనా సమర్పించి ఉండేవారు"** అని బేలయై బాధపడతారు. కానీ ఎప్పుడూ ఏదీ అడగని వ్యక్తి అది మాత్రం ఎలా అడుగుతారు? **"నీ హృదయం అందరికీ విడిది. ఎన్ని పక్షులయినా సుఖంగా విహరించగల విహాయసం"** అంటూ **"మా ఆయువులు తీసుకునైనా మరల జీవించరా"** అని ఎల్లలెరుగని ప్రేమతో ఎలుగెత్తి పిలుస్తారు.

ఈ సందర్భంలో తమ వ్యాసాలలో, ఉపన్యాసాలలో గోపాలకృష్ణయ్య గారందించిన సూచనలను ఒకసారి మననం చేసుకొందాం.

"భారతదేశం మీద మీరు నిలుపవలసింది మీ తరువాత తరాన్ని అని జ్ఞాపకముంచుకోండి. మీ తరువాత తరానికి ఏమిచ్చి ఆనందం పొందుతారో ఆలోచించుకోండి. మీ భాషను సంస్కరించండి. మీ భాషలో మాట్లాడించండి. అందరినీ కలిపి సమాజాన్ని నడపడానికి ప్రయత్నించండి.

వివేకానందుని సర్వమత సామరస్య ప్రబోధంతో, వీరేశలింగంగారి సంస్కరణల స్ఫూర్తితో, మహాత్మాగాంధీ త్యాగం, నిరాడంబరత, సత్యం, అహింసలతో, నిర్మాణ కార్యక్రమాలతో, పండిత నెహ్రూ సోషలిజం, పంచశీల ప్రబోధంతో, డా॥అంబేద్కర్ సర్వజన సమభావనతో యువతీ యువకుల్లారా! కదలి ముందంజ వేయండి! కార్యోన్ముఖులు కండి".

వావిలాల జీవన సర్వస్వాన్ని ఆకళింపు చేసుకొని, వారి ఆశయాల్ని అధ్యయనం చేసిన కవి చివరగా **"అగ్రజా నీ దేశం వీర సమాధి కాదు నిరంతర కంపిత తరంగిణి"** అంటూ వారి పద ధ్వని, ప్రసంగ ధ్వని తరంగ రూపాన దేశమంతటా నిరంతరం ప్రకంపిస్తూనే ఉంటాయని నివాళినందజేస్తారు.

* వావిలాల వారి జీవిత విశేషాలు అంతర్జాలంలో అందుబాటులోగల శ్రీ టి.వి.యస్. శాస్త్రి గారి వ్యాసం నుండి తీసుకున్నాను. వారికి ధన్యవాదాలు.

మరో సో.సు.ని చూపే "మనస్సంగీతం"

"Out beyond ideas of right doing and wrong doing there is a field. I'll meet you there" అంటాడు రూమీ. సందర్భము, సారాంశము ఏదైనా "Beyond our ideas, there is a field" అనే రెండు వాక్యాలు ఎంతో అన్వయానికి ఆస్కారమిస్తాయి. వ్యక్తికి తాను నడిచే మార్గంపట్ల అపరిమిత గౌరవం, అచంచల విశ్వాసం ఉన్నా; ఆ మార్గంలో ఎదురుపడనివి, తనలోనే దాగివుండి బహిర్గతమయ్యేందుకు ఎల్లప్పుడూ ఎదురు చూసేవి అయిన కొన్ని భావాలుంటాయి. అయితే, ఈ నిరీక్షణ కేవలం భావాలదేనా? తనతో తాను తన్మయ మొందే క్షణాల కోసం ఎవరు పరితపించరు? అయితే, కార్యవ్యగ్రతో, కలసి రాకపోవడమో, భవబంధాలో, భావ జాలాలో - ఈ సాధనకు అంతగా సహకరించవు.

1944లో అభ్యుదయ కవిత్వంలో ప్రవేశించి, బద్ధ హృదయంతో ప్రజాభ్యుదయాన్ని కాంక్షిస్తూ కవితలు రచిస్తున్న కాలంలో సైతం తనకోసం తాను ఏకాంత నిశాంత సమయంలో భావగీతాలు రచిస్తూ, ఎలుగెత్తి పాడుకొంటూ ఓ ఆరోగ్యప్రద ఆనందం పొందానంటారు సోమసుందర్. వాటిని ఓ మూడు దశాబ్దాల పాటు మూగగా నిద్రపుచ్చి, 1978లో కొన్ని ప్రబోధ గీతాలు, మరికొన్ని అనుభవైక గీతాల సంకలనంగా 'వెన్నెలలో కోనసీమ' ప్రచురించారు. అప్పటివరకూ వీరి నుండి ఉత్పాదమవుతున్న సాహిత్యానికి ఒకింత విరుద్ధంగా వెలువడిన గీతాలకు విమర్శ ఎదురుకావడంతో – అభ్యాసం, అభివ్యక్తి ఆపకున్నా అచ్చుకు మాత్రం నోచుకోనివ్వక అసంఖ్యాక గీతాలు వ్రాత ప్రతులుగా ఉంచేసారు. మళ్ళీ చాలాకాలం తర్వాత 1996లో మరో సంకలనం ప్రచురించి వారికి ఆత్మీయులైన డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు, సుభద్రమ్మ దంపతులకు అంకితమిచ్చారు. అదే "మనస్సంగీతం".

* * *

పదసరళత – ఈ ఒక్క లక్షణం మిగిలిన సోమసుందర్ సాహిత్యం నుండి ఈ గీతాలను వేరుచేస్తుంది. హృత్కవిత, చాంద్రీఝురి, ఉషస్సుషమ వంటి శబ్దాలు అక్కడక్కడా వీరి ముద్రను ప్రకటించినా అధిక శాతం సారళ్యంతో నిండి, పాటలన్నీ పాఠకుడిని పదే పదే పాడుకునేలా చేస్తాయి.

"మంచి పూలు కనిపిస్తే
మంచి మాట వినిపిస్తే
మంచి చీరలంగడిలో
వ్రేలాడుతు మురిపిస్తే,
నీవె జ్ఞాపకం ప్రియా, నీవె జ్ఞాపకం" అంటూ ఆమె సంకేత చిహ్నాలు తెలియజేస్తారు. మొదటి రెండు పాదాలలో ఒక్కొక్క సన్నివేశాన్ని నింపి, ఒకే సన్నివేశాన్ని తరువాతి రెండు పాదాలలో ఉంచడం, అందులోనూ రెండు భావాలను పలికించడం గమనిస్తాం. అయితే, వీటిని చూసి ఆమె గుర్తుకొచ్చిందో? లేక ఆమె ధ్యానంలోనే ఉన్న కవికి ఇవన్నీ మరింతగా ఆమెను గుర్తుతెస్తున్నాయో....!

ఒక అంశపు అరుణిమ మరో అంశాన ప్రతిఫలించడం ప్రాచీన సాహిత్యంలో పలుచోట్ల వర్ణితమైంది. గాథా సప్తశతిలో “ఆమె పెదాల ఎరుపుదనం క్రితంరాత్రి ప్రియుడు ముద్దులతో చెరిపివేసినా మర్నాడు ప్రొద్దున సవతుల కళ్ళలో ప్రత్యక్షమైనది” అనే దామోదరుని గాథ (6/2); శుభలేఖల వల్ల సుపరిచితమైన “జానక్యాః కమలామలాంజలి పుటే....” శ్లోకం వంటివి ఇందుకు ఉదాహరణలు. అయితే కవి మరో అడుగు ముందుకు వేసి **“ఓ లలనా తవ చరణాంగుళిని మెరయు పారాణికి నా యెదలో రాగరేఖ లెరుపులలమెనేమో”** – ఆమె పాదాల పారాణికి ఎర్రదనం తన ఎదలోని రాగరేఖలే అలిమాయంటారు. అలమడం అనే ప్రయోగం కేవలం ప్రతిఫలనం కాక శాశ్వత పరిణామాన్ని తెలియజేస్తోంది. ‘రాగ’ శబ్దాన్ని ‘ఎర్రని’ అనే అర్థంలో వాడడం ద్వారా కవి భావనకు మరింత పరిపూర్ణత సిద్ధిస్తోంది.

మరోపాటలో, **“ఎవ్వరరు దెంచారు ఈ అర్థరాత్రిలో; సవ్వడించే ఎడద వలపు తొందరలతో...”** అని, వచ్చినది ప్రేయసే అని రూఢి చేసుకొని ఆమెను **“పుట పుటకు నవభావ కుసుమాల జల్లితివి; అడుగడుగునకు క్రొత్త పులకలను కూర్చితివి”** అని ప్రశంసిస్తారు. ఇంతటి సవ్వడించే ఎడద వలపు తొందరలో కూడా తాను కవిని అనే స్పృహ కలిగి ఉండడం వలననే “పుట పుటకు నవభావ కుసుమాల జల్లితివి” అనగల్గుతాడు.

* * *

ఒకనాటి మధురానుభూతులు అందుకు కారణమైన వ్యక్తులను కోల్పోయాక భయంకర జ్ఞాపకాలై బాధిస్తాయి. మరలా ప్రయత్నించినా పొందలేమనే కారణం మనసుకు తెలుసు కానీ కన్నీరొలికే కంటికి తెలియదు కదా! అందుకే కవి **“కన్నులేలనో తెలియదు నీరు కార్చును; ఆ నీటికేమి పాటకలదో మనసు ఎరుగును”** అంటూ గతకాలపు తలపులవెతను, పట్టివిడువని కొరివి దయ్యంగా అభివర్ణిస్తారు. **“బ్రతుకంతా వేధించుట ఏమి న్యాయమో”** అని వాపోతూ ‘బ్రతుకంతా’ అనడంతో తాను ఎప్పటికీ మరువలేనివని చెప్పకనే చెబుతారు. స్మృతుల తాకిడితో గాయపడ్డ హృదయాలను


"పడిన తేనెపట్టు కొరకు ఏడ్చే మధుపములు"తో పోలుస్తారు. కూలినది తేనెపట్టు అనడం ద్వారా మరోసారి జ్ఞాపకాల 'మాధుర్యాన్ని', ఆ మాధుర్య సమీకరణకు ఇరు హృదయాల పరిశ్రమని నొక్కి చెప్పడం ధ్వని. మరో పాటలో **"పొదరింట్లో పవళించే పసి పూవా మేలుకో; తీవ కొసల స్వప్నించే రసరేఖా మేలుకో"** ఇక్కడ తీవ కొసల స్వప్నించే రసరేఖగా పసి పూవును పేర్కొనడం ఎంతటి ఉదాత్త భావన!

* * *

మేఘసందేశం కావ్యంలో యక్షుడు – "నీచైర్గచ్ఛ త్యుపరిచ దశా చక్రనేమి క్రమేణ" అని నచ్చజెప్పి, శరత్కాలపు నిండు వెన్నెల రాత్రులలో అనుభవించి ఆనందం పొందుదాం అని సందేశం పంపుతాడు. విరహ సమయాన ఎవరో ఒకరు ఆశా వాదంతో వ్యవహరించి మంచి కాలం ముందు ఉందన్న భరోసా అవతలివారికివ్వాలి. అందుకే, కవి ఓ పాటలో.. **"నిష్ఠురాల కలత నిదుర చలికాలము గడచెనులే; భ్రష్టమైన ఆశలు తిరిగి చివురు లెత్తునులే"** – అనే సానుకూల సందేశం ప్రేయసికి పంపుతాడు.

మరోచోట, **"దూరగగన సీమలలో గిరులు పులకరించునటుల; భూరేఖలలో వాలిన జలదమాల మొరయు నటుల... ప్రియ బాంధవి ఒక్కసారి నా కొరకై పాడవే"** – ఇది కవి అభ్యర్థన. అయితే కవి పెట్టిన రెండు నిబంధనలూ ప్రకృతి పరవశించే క్షణాలే. అమాయకపు కోర్కెగా తోచినా, తాను వినగోరే పాట స్థాయిని ప్రేయసికి తెలియజేస్తూ ముందరి కాళ్ళకు బంధం వేస్తాడు. అలా అని పాటలోని విషయమూ ఆమెకు ఐచ్ఛికం కాదు. **"ఎన్ని రాత్రులీ విధి మనము ఒరిగితిమో సుకములలో; తీయని మన వలపు కతలు, పాయని కన్నీటి వెతలో, తేనె లొలుకు అనుభవాలు, వేప పూల జ్ఞాపకాలు"** వీటన్నిటిని గురించి పాడమంటూ **"కలలు కడతేరునటుల, వలపులు కుసుమించు నటుల, వెతల సొదలు సమయునటుల, బ్రతుకు పరమళించు నటుల"** అని మరిన్ని నిర్దేశాలనందిస్తారు. ఒక్క మాటలో, వారిద్దరికి మాత్రమే తెలిసిన సంగతులను వారిద్దరికీ నచ్చిన రీతిలో వారికోసమే పాటకట్టి పాడమని కవి విన్నపం.

* * *



భావ కవిత్వపు ప్రధాన స్రవంతులయిన ప్రణయం, ప్రాకృతిక ఆరాధనలకు పెద్ద పీట వేసినా **"ఈ విశ్వ ప్రాంగణము నా నివాసాంగణము; సకల మానవ గణము నా రక్త బాంధవము"** అంటూ కొన్నిచోట్ల దేశభక్తిని, మరికొన్ని చోట్ల సంఘ సంస్కరణనూ వినిపిస్తారు.

* * *

అయితే, ఈ గీతరచనామార్గంలో సంప్రదాయకమైన నడకనే తప్ప వేరే పోకడలను ప్రయోగించకపోవడం వీరి ఘనత. అందుకే, "అరసం కవులకు ఆరాధ్యుడై లబ్ధ ప్రతిష్టుడైన విప్లవ భావకవి ఇచ్ఛాపూర్వకంగా నియమభంగాలు చేస్తాడేమో అని వెదికాను. ఉ, హు ఎక్కడా చెయ్యలేదు" అంటారు, ఈ కృతిని స్వీకరిస్తూ శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు. కేవలం మాటలకూర్పుగా కాకుండా నిర్దుష్టమైన మాత్రా ఛందాలు – త్రిస్రగతులు, చతురస్రాలు, ఖండాలు, మిశ్రాలతో నడిచి, లయ, గణ భంగములకు తావు లేకుండా రచించారని ప్రశంసించారు. పిఠాపురం ఊరి మట్టిపై నడయాడి ఊపిరి పీల్చిన కృష్ణశాస్త్రి, వింజమూరి శివరామం, తాను రచించిన పాటల్లా సోమసుందర్ పాట ఒక గొప్ప వారసత్వానికి చెందినదని ఆశీర్వదిస్తారు.

* * *

"మాటలు నిన్ను ఆలోచింపజేస్తాయి, సంగీతం అనుభూతిని కలిగిస్తుంది, కానీ ఆలోచనను అనుభూతి చెందాలంటే పాట కావాలి" అంటాడు E.Y. Harburg. అందుకే, మానవుని హృదయ సంబంధి సర్వ రసానుభూతులూ గీతంలోనే నిక్షిప్తమవుతాయని నమ్మే శ్రీ సోమసుందర్ తన శ్రమజీవన సహచారిణిగా పాటకు అసమాన స్థానమిచ్చారు. ఫలితంగా, పాట పట్ల వీరికున్న నిర్హేతుకమైన మమత్వం మనస్సంగీతమై ధ్వనించింది. వారి ఆలోచనలతో సహానుభూతిని పొందేందుకు మనకూ కొంత అవకాశమిచ్చింది.

అందినంత చందమామ...

సోమసుందర్ సాహిత్య శరీరం కవిత, విమర్శల కలబోత. తనలోని విమర్శకుడిని సంతృప్తిపరచి ఓ కవిత బయటకు రావడం, తనలోని కవికి ఏ మాత్రం ఇబ్బంది కలిగించని ప్రతిపాదనలతో విమర్శకుడు కొనసాగగలగడం –అంత సులభతరమైన విషయాలు కాదు. ఒక్క సందర్భంలోనే ఇది సాధ్యమనిపిస్తుంది. అది, మనసులోని భావాన్ని మాటలుగా మార్చేటపుడు ఏ విచలనాలకూ గురి కాకుండా తన పనిని "యథా తథ మనో అనువాదం" గానే నిర్వర్తించినపుడు. **"మనసులో కలిగిన అభిప్రాయాలను ఎవరి ప్రీతి కోసం వదలలేని బలహీనత నాది"** అని శ్రీ సోమసుందర్ ఒకింత వినమ్రతతో ఓ సందర్భంలో వ్రాసుకున్నా, తన బలహీనత తెలుసుకోగలగడం కన్నా బలమేముంటుంది?



దశాబ్దాల సాహిత్య కృషిలో వెలువడిన 120 గ్రంథాలను అభ్యసించడం (చదవడం కాదు సుమా!) కొన్ని జీవితాలకు సరిపడినంత వ్యాపకం. అందుకే, ప్రత్యేకించి చదివినవి, ప్రసంగవశాన విన్నవి... హృదిలో ప్రోది చేసుకొన్న పంక్తులు కొన్నిటిని కాసేపు గుర్తు చేసుకుందాం.

నిరాటంకంగా కొంత గమనం సాగించాక ఎంతదూరం ప్రయాణించామో ఓసారి తిరిగి చూసుకుంటాం. అలా ఓ సందర్భంలో తన నిరంతర సాహితీయాత్ర వెనుకగల చోదకశక్తి ఏదని తనలో తాను అన్వేషించుకున్నాడు కవి. **"మెదడు గదిలో పురాస్మృతి అనే వృద్ధురాలు రంగు రంగుల దారాలు కలగల్పి పేనుతూ కదురు త్రిప్పుతూ పురెక్కిస్తోంది కుదురుగా, కొన్ని రంగులు చిక్కులు విడటం లేదు కొన్ని రంగులు చెక్కు చెదరటం లేదు"** – ఇదీ రహస్యం. జాగ్రత్తగా పరిశీలిస్తే, 'పురాస్మృతి' గతానుభవాలకు, 'రంగురంగుల' వైవిధ్యాన్ని, 'దారం' అవిరళత్వాన్ని సూచిస్తాయి. ఈ చిక్కులను విడగొట్టే ప్రయత్నమే భావాలకు ఓ చెక్కు చెదరని రూపమిచ్చింది.

మరోచోట, **"నా నాల్క బాల్కనీలో ఆసీనలైన సుశబ్ద సుందరాంగులారా! లేవండి, నర్తించండి"** అని ఉత్తేజపరుస్తారు. తనలోని శబ్దాలను ఉత్తేజితం చేయడమంటే తనలోని కవికి ఆహ్వానం పలకడం లేదా తనను తానుగా ఆవాహన చేసుకోవడం.

పలు సందర్భాల్లో కవి అభివ్యక్తికి సమాజపు ఆక్రోశమే ప్రధానకేంద్రమైంది. **"నీ సంచార తలంలో ఉపరితల మంతటా చితా భస్మరాశులు".** చితా భస్మరాశులు ఉపరితలమంతటా పరుచుకొన్నాయంటే ఎంతటి భీకర దహనకాండ జరిగి ఉండాలో కదా! తిక్కన "ఎవ్వాని వాకిట నిభమద పంకంబు రాజ భూషణ రజో రాజినడగు" ఓసారి తళుక్కుమంటుంది. మరోచోట **"నర పశువుల గిట్టల రాపిడితో సర్వత్రా వ్యాపించిన విష ధూళీ ధూసరితమ్".** శాస్త్రరీత్యా మనిషి జంతువుగానే భావింపబడినా, ఉన్నత మేధతో పరిణామం పొంది తనదైన ప్రత్యేకతను సాధించాడు. కానీ, విడువలేని అమానవీయపు ఆనవాళ్ళను ఎత్తిచూపేందుకు కవి 'నరపశువుల గిట్టలరాపిడి'

అంటాడు. ఇక్కడ 'నర పశువు' ప్రయోగం రెంటికీ చెందని స్థితిగా కూడా అన్వయించవచ్చు. పై భావాన్ని మరింత సాంద్రీకరిస్తూ, మరోచోట "జాతి ఛాతీ నిండా ముళ్ళు గీరిన పుళ్ళు" అన్నపుడు, పాలకోసం ఆర్తిగా వెతుకుతూ రక్తసిక్తమైన మాతృదేహం చూసి తల్లడిల్లిన పసివాడి వేదన వినిపిస్తుంది.

ఈ స్థితి నుండి బయటపడాలంటే ముందు మనచుట్టూ ఉన్న బానిసత్వాన్ని చీల్చుకురావాలంటారు. కానీ అది అంత సులభం కాదు. మనం **"మతానికి బానిసలం, గతానికి బానిసలం, కలవాళ్ళకి బానిసలం, సంప్రదాయానికి బానిసలం, బానిసలకు బానిసలం".** మన అనుక్షణచర్యను మతం, యుగయుగాల జ్ఞాపకాలు, సంప్రదాయాలు, మనకంటే ఉన్నతులని మనం భావిస్తున్న వాళ్ళు నిర్ణయిస్తారు, నియంత్రిస్తారు. చివరి వాక్యం **"బానిసలకు బానిసలం"** ఈ భావదాస్యానికి పరాకాష్ట.

స్త్రీవాద కవిత్వ ఆవిర్భావ దశలో ఒకింత ఆక్షేపించినా, అనంతర కాలంలో ఆ కవిత్వపు ఆవశ్యకతను సమర్థించటమే కాక 2006లో "ఆధునిక మహిళా సాహిత్య సదస్సు"ను నిర్వహించి ప్రసంగ వ్యాసాలన్నింటిని "సౌభాగ్య సంధ్య" పేరిట ప్రచురించారు సోమసుందర్. యుగయుగాలుగా మహిళలు ఎదుర్కొంటున్న దాష్టీకాన్ని, అన్యాయాల్ని తన కవితలో ప్రభావవంతంగా పలికించారు. సమకాలీన సంఘటనల ఆధారంగా 'వ్యాఘ్రాటవి' కవితలో ఒంటరిగా కాదు కదా, జంటగానూ బయట తిరగలేని మహిళల స్థితిని వర్ణిస్తూ **"నెల్లిమర్లలో గౌరమ్మయినా; జమ్మలమడుగులో శారదాంబయినా భర్తతో సినిమా కెళ్ళిందంటే శవమై పోకా తప్పదు. ప్రతి ఊరు వ్యాఘ్ర నగరం, ప్రతి బస్తీ నాగేశ్వరం, ప్రతి నగరం వృషభేశ్వరం, కాకుంటే నృకేశ్వరం"** అని అసలు పేర్లు ఏవైనా ప్రతి ఊరూ క్రూరమయమైన వైనాన్ని చిత్రిస్తారు. ఈ సందర్భంలో సోమసుందర్ సృజించిన కవితాపాదం వారి మొత్తం సాహిత్యంలో వెలువరించిన అత్యుత్తమ పది వాక్యాలలో ఒకటిగా పేర్కొనదగ్గది. **"నీ భుజానికి మైజారే కాదు, నీ మొలకు కైజారూ అవసరమే"** మరువకు తల్లీ మరువకు అని తీవ్ర ఆవేదనతో హెచ్చరిస్తారు.

* * *



మనోనేత్రంతో చూస్తున్న దృశ్యాన్ని మనలోనికి ప్రవేశపెట్టడానికి తానెంచుకునే ప్రతీక సనాతనమా? ఆధునికమా? ఆ పదం అన్యదేశ్యమా? గ్రామ్యమా? కవి ఈ పరిధి విధించుకోలేదు. భావానుగుణమైన పదసంయోజనం అసంకల్పితంగానే అమరిపోయింది. అందుకే, **"ఆపాద మస్తం ఆకులు, రెమ్మలతో నేల మీద నుంచున్న అశోక వృక్షాన్ని, వసుంధర ధరించిన పోనీటెయిల్"** గా దర్శిస్తారు. జ్ఞాపకాలను నూనె ఒలికిన నాపరాళ్ళపై పద ముద్రలంటారు. ఋతువర్ణన చేస్తూ, హేమంతాన్ని **"రాగల ముదిమికి జడిసే అలజడి"** గానూ, శిశిరాన్ని **"వృద్ధాప్యము వలె కోర్కెల రాల్చేది"** గాను వర్ణిస్తారు. అనవసర ఆచ్ఛాదనలు లేకుండా నిర్మల తటాకాంతర్గతమైన వస్తువును ఒడ్డున కూర్చున్న పాఠకుడికి యథాతథంగా చూపిస్తారు.

* * *

సంపన్న కుటుంబీకుడైనా, జైలు జీవితం అనుభవించిన సోమసుందర్‌కి ఆకలి తెలుసు. వ్యవసాయదారునిగా రైతు అగచాట్లూ తెలుసు. అందుకే, **"ఆకలి వయసెంతో నీకేం తెలుసు?"** అని ప్రశ్నిస్తూ **"ఆకలి ముసలిది నొసటను అరచేయి కప్పి ఆకాశాన్ని వెదుకుతూ, నల్ల మబ్బుల కోసం వల్లమాలిన ఆర్తితో కనుగ్రుడ్లు విసురుతుంది"** అంటారు. ఇక్కడ కనుగుడ్లను విసరడం – కనుచూపు మేరలో మబ్బు కనబడడం లేదని ధ్వన్యాత్మకంగా చెప్పడం. మరోచోట **"ఈ పొలం మట్టి క్రింద కుళ్ళుతున్న ఎముకలు ఈ పొలం పూర్వ యజమానివేనా? అప్పుడప్పుడు బావురుమంటూ చప్పుడు చేస్తాయి"** అంటూ మన ఎదలోతులను తవ్వి కలుక్కుమనిపిస్తారు. జీవితాన్ని మరింత జీవనీయంగా మార్చడానికి ఆర్ద్రత, కరుణ, దయాంతఃకరణల కన్న ఇతరేతర పరికరాలేమీ ఉన్నట్లు ఎవరూ కనుగొనలేదు (కాలానికి కవిత్వం కాపలా దీపం) అని నమ్మే సోమసుందర్ తన కవిత్వంలో ఈ మూల ధాతువులకు ఎన్నడూ లోటు రానివ్వలేదు.

* * *

తన ఆనందాన్ని, ఆవేదనను ప్రకటించడానికి ఆధారమైన అక్షరమంటే ప్రతి కవికీ అంతులేని ఆరాధన. అందుకే ఆ అక్షర శక్తిని, మహత్యాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరిస్తూ అక్షరాలు సుమీ ఇవి జాగ్రత్త... అని హెచ్చరిస్తారు.

"అక్షరమంటూ చేతికి చిక్కితే హరివిల్లు కిరీటంగా అమరినట్లే"
రుజకీ, జరకీ, గ్లానికీ, హానికీ అక్షరం ప్రబల శత్రువు సుమా!
అక్షరాల నాదం వినగానే, భయపడి చస్తుంది మృత్యువు" - హరివిల్లు కిరీటం కావాలంటే ఆకాశమంత ఎదగాలి కదా. ఆ ఉన్నతికి అక్షరం చేరువ చేస్తుందని కవి భావన. వృద్ధాప్యం, అనారోగ్యం, అలసట, ప్రమాదాలని ఎదుర్కోగల ఏకైక ఆయుధం అక్షరం. సోమసుందర్ జీవన రేఖాంకన తెలిసిన వారెవరికైనా పై వాక్యం కవితా పాదంగాకాక, స్వీయచరితలో సంఘటనగానే అన్వయమవుతుంది. **"జిహ్వాగ్రాన్నీ, శ్రవణ మంజూషను అనుసంధానించే మంత్ర శక్తిగా"** కొనియాడుతూ **"అనిలం వలె సలిలం వలె ప్రవహిస్తూనే అజరామరంగా"** అంటారు. ఇలా అక్షరానికి విరుద్ధ ధర్మాలు గల అనిలం, సలిలం రెంటితోనూ సమన్వయము ఏర్పరచడం ద్వారా కవి ఉల్లేఖాలంకార నిర్మాణం చేస్తారు.

* * *

"ఆగతానికి శుభారంభం" సంపుటిలో ఓ కవిత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. **"వెలుగుతున్న కొవ్వొత్తిని చూస్తే అసహ్యం నాకు"** - ఈ ప్రారంభం చూసి ఆశ్చర్యపోతాం. సరిగానే చదివామా? లేదా అని ఒకింత ఏకాగ్రతతో మరోసారి చదివేందుకు సిద్ధపడతాం.

"Change the way you look at things and the things you look at change". కవి దృక్కోణమే కవితగా మారి కొత్త ఆలోచనకు తెర లేపుతుంది. ఇంతకీ కొవ్వొత్తి ఎందుకు నచ్చలేదంటే, అది - వెలిగించిన మరుక్షణం నుండి ఏడుస్తూనే ఉంటుందిట.

మీ కోసం మీ పిల్లల కోసమే ఇలా బాధలు పడుతున్నానని చీటికి మాటికీ జగడమాడే పతివ్రతలా, మహా కావ్యాలెన్నో వ్రాసినా మీరు జడులై నా ఘనతను గుర్తించలేదు - అంటూ ముక్కి ముక్కి, వెక్కి వెక్కి ఏడ్చే మహాకవుల్లా - సెల్ఫ్ పిటీకి పరాకాష్ట కొవ్వొత్తి అంటారు. ఇక్కడ పతివ్రత, మహాకవి పదాల ప్రయోగంలోనే అధిక్షేపతత్వం కనిపిస్తుంది. పోసినంత చమురూ త్రాగి, సరుకు నిండుకుంటే హాయిగా

ఆరిపోయే మట్టి ప్రమిదలో దీపాలు; తీగకు వేలాడుతూ వాటి ఆవరణలో హాయిగా వెలిగే విద్యుద్దీపాలు ఈ కొవ్వొత్తి కంటే ఎంతో నయమంటారు. నిజానికి కొవ్వొత్తి చేసేది తన బాధ్యతల నిర్వహణే గానీ ఏదో గొప్ప త్యాగం కాదని కవి భావన. అందుకే, వెలగడమనే లక్ష్యసిద్ధి కోసం పుట్టిన దీపం, బ్రతికినంతకాలం తన కాంతులు ప్రసరించాలి. చేస్తున్న పనికి కైదండలు కైవారాలు కోరడం అవివేకం - అంటారు.

ఈ కవిత చదివాక కవి ఆలోచనతో పూర్తిగా ఏకీభవించినా, లేకపోయినా వస్తువు ఎంపిక, శిల్పం, తన perception ని కన్విన్సింగా అందజేయడం అనే లక్షణాలు దీనిని దాచుకోదగ్గ కవితను చేసేస్తాయి.

* * *

ఇక అనువాదాల విషయానికొస్తే భావప్రసరణకు శాబ్దికక్లిష్టత అవరోధం కానివ్వరు. మూలం తాలూకు అంతస్తత్త్వం మరుగున పడకుండా తనదైన Ego Interference కి తావు లేకుండా అనువాదాలు సాగాయి. ఉదాహరణగా Pablo Neruda కవితకు Jodey Bateman చేసిన ఆంగ్లానువాదం ఆధారంగా సోమసుందర్ చేసిన తెలుగును పరిశీలిద్దాం :

To the foot from its child :

A Child's foot doesn't know it's a foot yet
And it wants to be a butterfly or an apple
But then the rocks and pieces of glass,
the streets, the stairways
and the roads of hard earth
keep teaching the foot that it can't fly,
that it can't be a round fruit on a branch.
Then the child's foot
was defeated, it fell
in battle,
it was a prisoner,
condemned to life in a shoe.

"పసిపాప పాదానికి తానొక పాదాన్ననే సంగతి ఇంకా తెలియదు.
కనుకనే తానొక సీతాకొక చిలుకనో, లేదా ఒక యాపిల్ పండునో
కాగోరుతూ మురిసిపోతూ ఉంటుంది.
కాలం గడుస్తున్న కొద్దీ కంకర రాళ్ళూ, గాజు పెంకులూ దాని కెదురవుతాయి.
వీథులూ, నిచ్చెనలూ ఆహ్వానిస్తాయి.
సూది మొనల గులక రాళ్ళతోను, మట్టి బెడ్డలతోనూ నిండిన
కాలిబాటలు సన్నిహిత మవుతాయి.
అవన్నీ దానికి అది వట్టి పాదమేనన్న సత్యాన్ని తెలుపుతాయి.
పాదం ఎగరలేదన్న సంగతి నేర్పుతాయి.
కొమ్మ చివర ఉబ్బిన పండు కానేకాదన్న యదార్థం జ్ఞాపకం చేస్తాయి.
అప్పుడు పసిపాప పాదం ఓడిపోతుంది.
ఆశాభంగం చెందుతుంది.
జీవన రణరంగంలో క్రింద పడిపోతుంది.
బూటులలోనో, చెప్పులలోనో బందీగా బ్రతకమని శిక్షింపబడుతుంది" – మూలకవి పట్ల అచంచల గౌరవం, అనువాదకునిగా నిబద్ధత ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. లేకపోతే మూలంతో పరిచయం లేని పాఠకునికి ఏ భావన ఎవరు పలికించారో, తానెవరిని ప్రశంసించాలో అర్థం కాదు.

* * *

మనకు నచ్చిన విషయాల మాట అటుంచితే, సోమసుందర్ పదే పదే ప్రస్తావించే గ్రంథం – **"మా ఊరు మారింది"**. వారి గురువైన కృష్ణశాస్త్రికి **"కవితా చేతన చైత్రా, అస్మదమల హృన్నేత్రా..."** అందుకోమంటూ అంకితమిచ్చిన గ్రంథమిది. **మా ఊరి అమావాస్య, మా ఊరి సూర్యోదయం, మా ఊరి మధ్యాహ్నం, మా ఊరి శారద రాత్రి, మా ఊరి ఉష్ణరశ్మి** – అనే ఖండికలుగా సాగుతుంది. వివిధ ప్రాకృతిక సన్నివేశాల్లో గ్రామవర్ణనలా ఉన్నా, సమాజపు రుగ్మతలు, ఇంకా కొనసాగుతున్న వర్జనీయ విషసంస్కృతులు సమాంతరంగా కవితలో కనిపిస్తాయి. **"గుడికెదురుగా**



ఇప్పటికీ యుగ యుగాల జీర్ణగాథలతో నాచుపట్టిన తటాకం అలాగే ఉంది" అనడం అందుకు ఉదాహరణ. ఉత్తరింపబడిన ఒకనాటి సౌమనస్య సస్యాలను గుర్తుచేస్తూ కవితంతా ఏక సూత్రంగా సాగిపోతుంది.

"వెన్న ముద్దల వంటి ఎద్దులు; చీకటి - పిచ్చివాడెవడో మసి క్రుమ్మరించి నట్లు" - ఇలా ఎన్నెన్నో అరుదైన భావనలు పుస్తకంలో పలకరిస్తాయి. ఉదయవేళ సూర్యుడు **"తన మొగాన్ని పరులకు చూపించలేక చెట్ల చింపిరి జుత్తు కప్పుకొని దాచుకుంటాడు; మెత్తని గరిక పోచలకంటుకున్న చల్లని మంచు బిందువులతో రక్తసిక్తమైన తన మొగాన్ని తుడుచుకుంటాడు; నింపాదిగా సర్దుకొని స్థిమితపడతాడు"** లోకమంతా రాత్రి చిందిన రక్తానికి సూర్యుని సాక్షిని చేసే వాక్యమిది.

"చెట్టు క్రింద ఏకాంతంగా కునికిపాట్లు పడే నీడ కంగారుగా సర్దుకుంటూ లేచి ఆహ్వానిస్తుంది. దరికిచేరి ఆదరిస్తూ సేద తీరుస్తుంది". ఇలా ఒక్కసారి వాక్యం దృశ్యమైపోతుంది. ఈ లక్షణమే అనేక పురస్కారాలనందుకొని వీరికి మరింత యశః కారణమైంది. ఆశ్చర్యమేమిటంటే, "మా ఊరు మారింది" అనే శీర్షికను చూసి ఇదంతా పిఠాపురం చరిత్రనుకుంటాం కానీ, సాహితీ మిత్రులు దిలావర్ ఆహ్వానం మేరకు సోమసుందర్ ఖమ్మంజిల్లా, ముత్యాలంపాడు గ్రామాన్ని దర్శించినప్పుడు ఏర్పడ్డ భావనల ప్రతిరూపమే ఈ కావ్యమని ఇంతవరకూ ఎవ్వరికీ చెప్పలేదుట !!

* * *

"నాకు తెలుసు, నా కవిత్వం శూన్యంనుంచి ఆవిర్భవించదు
జనతా జ్వలత్ జ్వాలల నుంచి
ఉపమా, రూపకాదులనే కాక
జీవనజ్యోతుల్ని సైతం పరుచుకుంటుంది.
స్వాత్మకమెంత పసందో
పరాత్మకం సైతం నాకంతే కనువిందు" అంటూ సోమసుందర్ తన కవిత్వాన్ని విశ్లేషించుకుంటే "సమాజం - వ్యక్తి - సాహిత్యం గురించి లేనిపోని ప్రగల్భాలకు

పోకుండా సమతూకంలో ఉంది ఆలోచన" అని మూల్యాంకన చేస్తారు "సాహిత్యంలో సంశయ కల్లోలం ముందుమాటలో" మహీధర రామమోహనరావు గారు. కేవలం గవాక్షంలో అంతరిక్షాన్ని వీక్షించడం కాకుండా వీరి సువిశాల సాహిత్యాన్ని కొంత అధ్యయనం చేస్తే పై రెండు Statements నిజమనేవారిలో మనమూ చేరతాము.

* * *

అవిచ్ఛిన్న సాహితీ కృషిలో "పదం, వాక్యం, ప్రక్రియ" మార్పు తప్ప కవిగా సోమసుందర్ నిరంతర ఆకాంక్ష, ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యే అంతః స్రవంతి ఒక్కటే – అది :

"సకల జనతా సౌఖ్య దాతగా సౌమనస్యము పండాలని"
మనస్సుషమాలింగ గీతిగ
వచస్సుషిరా మోదగానము
నాల్గు దిక్కులా వెలుగు రేకల
క్రమ్మవలె సుస్వరము రీతిగా..." – "హితేన సహితం సాహిత్యం" – ఈ మూల సూత్రం మరువని కవి శ్రీ సోమసుందర్. అందుకే, శతాధిక గ్రంథాల నిండా మేధను చిలికించి, ఒలికించిన సాహిత్యపు వెన్నెలలో అలసిపోయేంతగా ఆడుకుందాం. ఆ చందమామను మరింత అందుకునేందుకు అనుదిన అభ్యాసం చేద్దాం.

లఘు కవితారూపంగా సుదీర్ఘ జీవన సారం - 'చంద్రభాగ'

"నేను వచ్చింది గొంతెత్తి గానం చేయడానికే
నేను దేనినీ పరిష్కరించాలని రాలేదు
నాతో కలిసి మీరంతా
మహత్తర బృందగానం చేస్తారనే వచ్చాను" – ఇది చిలీ కవి Pablo Neruda కవిత్వానికి డా॥ ఆవంత్స సోమసుందర్ చేసిన అనువాదం. పై వాక్యాలను కేవలం అనుసృజనగా కాక, వారి సుదీర్ఘ సాహిత్య జీవనంలో అనుదినచర్యగా అన్వయించుకోవచ్చు. మనమంతా (పాఠకులు) తెలుగు సాహిత్య ప్రమేయంతోనే నియమితులమై ఉన్నామని విశ్వసిస్తూ, ఉల్లసోల్లలిత మనోజ్ఞ రంగవల్లికలలో, వెన్నెలరాత్రి శరత్ శోభలు జాలువారుతున్న సమయంలో, మంచి కవిత్వం ఆరగించడానికి మనసారా ఆయత్తపరుస్తూ ఆహ్వానిస్తారు.

శ్రీ పూడిపెద్ది వేంకట రమణయ్య 1920వ దశకం లోనే 'అల్పిలు–సూదులు' అనే శీర్షికతో వినూత్న ప్రయోగాత్మక కవితలు రచించారు. హైకూకు దాదాపు సరి సమానంగా ఉండే ఈ విస్మరిత కవితా రూపంలో చంద్రభాగ నదీ తీరాన సోమసుందర్ సృజించిన కావ్యమే ఈ **"చంద్రభాగ"**.

"కవి హృదయం

కెమీలియా మొక్క

ఒకే రెమ్మ నుంచి అనేక వర్ణాలు పూస్తుంది" - ఈ వర్ణాన్ని మాత్రం ఎందుకు విడిచిపెట్టాలనుకుందో ఏమో! వీరి హృదయం లఘు కవితారూపాన చంద్రభాగయై, సాహితీసంద్రాన భాగమైంది.

మధురస్మృతులు, ఆ అనుభవాలు పునరావృతం కాగలవనే ఆశా - జీవిత మంతా వెన్నంటే ఉంటాయి, కారణమైన బంధమేదయినా సరే.

"పొడి ఇసుక రేణువు

వ్యామోహం వీడలేక

కెరటం కోసం వేణువులూదుతోంది" అంటారు సోమసుందర్.

ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమాన్ని Attention, Sensation, Interpretation by Brain గా మనోవిశ్లేషకులు సూత్రీకరించారు. అందుకే, ప్రకృతితో మమేకమైన కవి, తన వైయక్తిక అనుభూతులన్నిటినీ ఆ ప్రకృతిలోనే దర్శించ గలుగుతాడు. ఈ సందర్భంలో మృచ్ఛకటికమ్ (పంచమాంకం)లోని ఈ శ్లోకం ప్రస్తావించుకుందాం.

సంసక్తైరివ చక్రవాక మిథునైః హంసైః ప్రనీడైరివ

వ్యావిద్ధైరివ మీన చక్రమకరైః హర్మ్యైరివ ప్రోచ్ఛ్రితైః

(గాలికి కదులుతున్న మబ్బులు రకరకాల రూపాలు ధరిస్తున్నాయి. చక్రవాక దంపతుల్లాగ, ఎగురుతున్న హంసల్లాగ, చేపల గుంపుల్లాగ, పెద్దపెద్ద భవనాల్లాగా. వీటితో ఆకాశం ఒక పెద్ద చిత్రపటంలా ఉంది.) అయితే, సమకాలీన స్థితిలో కవికి భువనమంతా నిండిన క్రౌర్యాన్ని ప్రతిబింబించే దర్పణంగా గగనం గోచరిస్తోంది. అందుకే, శాపగ్రస్తుల (పేదల) గృహాలన్నీ భూమిముఖం మీద స్ఫోటకపు మచ్చలుగా కనిపిస్తున్నాయ్.

సాయంత్రపు నీరెండలో

దూరపు మేఘారణ్యంలో

పులులూ, చిరుతలూ

దుమ్ముల గొండులూ, తోడేళ్ళు.

దుర్బలునికి ఉన్న అవకాశాలూ ఉపయోగపడకపోగా, ప్రమాద హేతువులౌతాయి.

"రెక్కలచేప ఎగురుదామనుకుంది

పొంచిన పక్షి వాడిగా చూస్తోంది

నీటిలోతులకు పోదామనుకుంది

పెద్ద చేప ఆకలిగా వస్తోంది". అడుగడుగునా ప్రమాదం, ఎటుపోవడానికి పాలుపోని స్థితి. కానీ ఈ రెండింటి నడుమా మనుగడ సాగించక తప్పదు. అదనపు అర్హతలనుకొన్న రెక్కలు, చేతనైన 'ఈత' విద్య తనకు సహకరించలేవు.

చిన్న చేపను పెద్ద చేప మింగే ఆహారపు గొలుసును వివరిస్తూ, పరోక్షంగా సామాజిక అంతరాన్ని, దాష్టీకాన్ని సుతిమెత్తగా విమర్శిస్తారు మరోచోట :

'లక్ష చేపల్ని తిని విర్రవీగిన షార్కు

తన పెళ్ళాన్ని తిమింగలం మింగేస్తే

అన్యాయం అంటూ కన్నీరై మిగిలింది' అంటూ తనదాకా వస్తే గానీ చాలా విషయాల తీవ్రత తెలుసుకోలేనితనాన్ని తెలియజేస్తారు.

లక్ష్యం సంక్షేమం కానప్పుడు, మంచిపనే అయినా మనసారా చేయనపుడు, అది గర్హించదగినదే.

'చెదపురుగులు

జ్ఞానం కోసం తినవు పుస్తకాలు

ధనికుల అన్నదానం జీవకారుణ్యం కాదు" – అభినందించే ముందు అంతరంగాన్నీ గమనించాలి.

కవిత్వమంటే ఎంతసేపూ త్రికాలాబాధిత సత్యాలే కాదు కాసింత హాస్యమూ చోటుచేసుకోవాలని భావించే శ్రీ సోమసుందర్; భార్య ఎంతటి సౌందర్యవతి అయినా ఆమెను చూస్తూ ఎపుడూ ప్రకాశించని కళ్ళు పరకాంతలు కనబడగానే వెలిగిపోవడాన్ని

"ఇంట్లో నా కళ్ళు
డిసిమల్ లైట్లు
వీధిలో మాత్రం సెర్చిలైట్లు" అంటూ చమత్కరిస్తారు.

సాహిత్య కృషి ఓ నిష్కామకర్మ. మరేదో లక్ష్యసిద్ధి కోసం కవిత్వాన్ని ఉపకరణంగా వాడుకోవడం దోషం. అవార్డులు, బిరుదులు ప్రాచుర్యాన్ని కలిగిస్తాయి గానీ, నీ రచనలకు శాశ్వతత్వాన్ని సిద్ధింపజేయవు. ఈ అభిప్రాయాలన్నీ సంభాషణ మధ్యలో పలుసార్లు సోమసుందర్ వ్యక్తంచేసిన నిశ్చితాభిప్రాయం. బహుశా ఈ భావనే ఈ కవితలో వ్యక్తమైంది.

"పేరులేని పిట్ట
తీయని పాటలు వినిపిస్తోంది
ప్రాధాన్యత పేరుకా? పాటకా?" – ప్రాధాన్యత ముమ్మాటికీ పాటకే అని చెప్పకనే చెప్పడం.

పరిణామం పొంది జంతువుల నుండి విడివడి మనుషులుగా రూపాంతరం పొందిన మనం శారీరక మార్పులేగానీ మానసికంగా గతకాలపు వాసనలు విడిచి పెట్టలేదంటారు కవి. మనిషికి, జంతువుకి భేదం కేవలం వస్త్రధారణే కాదు. **"సకల జంతుజాలమూ నగ్నంగా స్వేచ్ఛా విహారం చేస్తుంది. మనిషి బట్టలలో బంధించబడి, మనసును ఆటవికంగా వదిలేసి"** అంటూ అంతస్సౌందర్యపు ఆవశ్యకతను గుర్తుచేస్తారు.

ప్రాచీన సాహిత్యంతో పెనవేసుకున్న అనుబంధం అపుడపుడూ అసంకల్పితంగా వచ్చి పలకరిస్తుంది.

"వాన కురుస్తోంది

ఆకులు కన్నీళ్ళు కారుస్తూ

తడిపిన బట్టపిడపల్లా పిట్టలు" ఈ చివరి పాదంలోని ఉపమానంలో ఆముక్తమాల్యద – "తల బక్షక్చుట గ్రుక్కి బాతువులు" స్ఫురిస్తుంది.

"తోటలో విహరిస్తుంటే

సీతాకోక చిలుక పలకరించింది

నరుడా నీకిక్కడ తావులేదు

నీ చేతులలో విధ్వంసం" – ఇక్కడ 'మైల పడిపోయెనోయి నీ మనుజ జన్మ" పుష్పవిలాపం జ్ఞప్తికొస్తుంది.

"బాకు మొన కన్నీరు కార్చదు"; "పెద్దపులి లేడి అందానికి మురిసిపోదు"; "పూల దండ ధరించాలంటే తల వంచక తప్పదు" – ఇలా పదేపదే మన మాటలలో 'కోట్'లుగా అమరిపోయే అందమైన వాక్యాలు అడుగడుగునా పలుకరిస్తాయ్. ఇక ఈ కావ్యంలో అత్యుత్తమ మనదగ్గన భావన

"వాన కురిసింది

వాకిట్లో నిలిచిన నీటిపై తేలుతూ నా కవిత

తీసుకుందామని వెడితే

నేలపడిన జాబిల్లిబిళ్ళ" – చదివిన వెంటనే ఓ సుందర సందర్భం దృశ్యమానమై, మనమే ఆ చందమామను చూసిన పాత్రలుగా మారిపోతాం. అంటే పాఠకుడు కవిగా మారిన పతాక స్థితి. ఇది కవిగా భావుకుడు పొందగల అత్యున్నత విజయం. మరోచోట, చినుకులు బొరియలెలా చేస్తున్నాయోనని చూస్తున్న పాప కన్నులలో ఆశ్చర్యాన్ని అక్షరంగా అనువదిస్తారు.

"కాలోహి దురత్రికమః"; 'జాతస్యహి ధ్రువో మృత్యుః" ఈ పదాల అర్థాన్ని మనం అనేక రూపాలలో అనేక సందర్భాలలో వింటూనే ఉన్నాం. కానీ ఈ అంశాన్ని అత్యంత సామాన్య సంఘటన ఆధారంగా ఇలా అంటారు –

“వాల్ పోస్టర్లు తింటోంది మేక

సావిత్రి, రంగారావు, రామారావు అందర్నీ మింగేసింది

కాలంలా నల్లగా మేక” ఎంతటి ఘనకీర్తి పొందిన వారైనా భౌతికంగా శాశ్వతులు కారనే కాలాతీత సత్యాన్ని ఇంత సరళంగా చెప్పడం అంత సులభం కాదు కదా!

ఎంతగానో నచ్చితే తప్ప నచ్చిందని మెచ్చుకోలేకపోవడం, నచ్చనిదేదైనా గుచ్చుకునేంత సూటిగా చెప్పడం శ్రీ సోమసుందర్ గారి తత్త్వం. కారణం బహుశా ఇదేనేమో అనిపిస్తుంది. ఈ వాక్యం చదివినపుడు –

“సురభిళంలో అధివశించిన గుండెలు

అపభ్రంశాలను ఆదరించవు” – ప్రాచీనాధునిక, సంస్కృతాంధ్ర సాహిత్యాలతో పాటు ఆంగ్ల సాహిత్యాన్నీ ఆపోశనపట్టి, వాటి సాహితీ సురభిళాన్ని శ్వాసకోశ మంతా నింపుకొన్న వీరికి అపభ్రంశాలతో రాజీపడాల్సిన అవసరమేముంది?

చంద్రభాగ కేవలం “నిద్రలో, అనుభవాలు జారిపోనీయకుండా; మెలకువలో, కలలు పారిపోనీయకుండా భద్రపరచుకున్న’ జ్ఞాపకాల మాలిక మాత్రమే కాదు; తెలుగు సాహిత్యంలో లఘుకవితా విభాగానికి అదనపు సొబగులద్దిన శ్రీ సోమసుందర్ కానుక.

“ **1998లో చంద్రపూర్ పర్యటనలో వ్రాసిన గ్రంథం 2012లో ప్రచురించి, వీరి బాల్య మిత్రులు, కవి కీ॥శే॥ మేకా సుధాకరరావు కుమారుడు శ్రీ మన్మథరావుకి అంకితమిచ్చారు.** ”

'కళాకేళి'లో కాసేపు...

"నేనూ మీరు నడిచే భూమిపైనే నడుస్తున్నాను.
మీరు పీల్చిన గాలినే పీలుస్తున్నాను.
మీరు చూస్తున్న వెలుగునే పంచుకుంటున్నాను.
అయితే, ఈ మెదడు మీ మెదళ్ళ కంటే ముందు నుండీ పనిచేస్తోంది, అంతే తేడా.
ఇక వయసంటారా?
అది ఎవరిది వారిదే. దీనిని తగ్గించలేం. పెంచనూలేం.
అందుకే పలకరించేప్పుడు నమస్కరించడం కంటే మీ హస్త స్పర్శ నాకెక్కువ ఆనందానిస్తుంది." – ఇవీ, తొంభై మూడు వసంతాల సాహితీ వతంసులు డా. ఆవంత్స సోమసుందర్, పిఠాపురంలోని వారి స్వగృహం 'కళాకేళి'లో సాహితీ మిత్రులం కలసి సభక్తికంగా నమస్కరించినపుడు అన్న మాటలు.

* * *

ఈ సందర్భంలో ఒక ప్రత్యేకమైన ప్రశ్నావళిని సిద్ధం

చేసుకోని కారణంగా అప్పటికప్పుడు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు వారి ఆరోగ్యం సరిగా లేకపోయినా ఎంతో ఆప్యాయనంగా సమాధానమిచ్చారు. తన జీవన రేఖలన్నిటినీ ఇప్పటికే మొదటి భాగాన్ని **"కలలు-కన్నీళ్ళు"**గా; రెండవ భాగాన్ని **"పూలు-ముళ్ళు"**గా మన ముందుంచిన ఈ సాహితీస్రష్టతో జరిగిన సంభాషణను వివిధ సందర్భాలలో వారి పుస్తకాలలో, ఇంటర్వ్యూలలో వెలిబుచ్చిన అభిప్రాయాలతో అన్వయిస్తూ సాహితీ ప్రియులకు అందజేయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

* * *

పరిశోధకుల భిన్నాభిప్రాయాలు :- ప్రాచీన కవుల కాలాలు, ప్రాంతాలు; అలాగే కొన్ని గ్రంథాల రచయితల గురించి పరిశోధకుల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. ఈ భేదాలకు కారణమేమైఉంటుందని అడిగినపుడు ఎంతటి లబ్ధప్రతిష్ఠులైన పరిశోధకులయినా, శాస్త్రకారులయినా ఒక విషయాన్ని గురించి సమాజానికి ప్రకటింప దలుచుకున్నపుడు ఖచ్చితమైన ఆధారాలను చూపాలని; లేకుంటే, తాత్కాలికంగా ఆ వ్యక్తిపై గల విశ్వాసంతోనో లేక గౌరవంతోనో అతని ప్రతిపాదన అంగీకరింపబడినా అనంతర కాలంలో మళ్ళీ ప్రశ్నలు తలెత్తి, వారు చేసిన ఇతర పరిశోధనల ఫలితాలపై కూడా విశ్వసనీయత సన్నగిల్లుతుందన్నారు. కొందరి విషయంలో సరైన ఆధారాలు లేకున్నా ఆ శాస్త్రకారుని శిష్యగణం / అనుయాయులు 'అంతరుద్బోధం' అని భావించి అనుసరించినా, ఇతర వర్గాలు వాటిని విస్మరిస్తాయన్నారు.

ఆశ్వాసాంత గద్యలలో కవులు వారి వ్యక్తిగత విశేషాలను, సాహిత్య కృషిని అందజేసిన దృష్ట్యా, వాటిని సాహిత్య చరిత్రకు అత్యంత ఆవశ్యకంగా మనం పరిగణించాలని; కవి కాలాదులకు సంబంధించిన విచికిత్సలు ఏర్పడినపుడు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని; అందుకే, సాహిత్యంతో పాటు వాటికీ సమానమైన ప్రాధాన్యతనివ్వాలని అభిప్రాయపడ్డారు.

అగ్ర తాంబూలం :- తెలుగు సాహిత్యంలో తిక్కనదే అగ్రస్థానం అన్నారు శ్రీ సోమసుందర్. నాటకీయత ప్రధాన బలంగా సాగిన వారి శైలిని అనంతర కవులు కనీసం అనుకరించలేపోయారని, **నాచన సోమన** కొంతవరకు కృతకృత్యుడు కాగలిగాడని చెబుతూ తిక్కన లేనిదే తెలుగు కవిత్వం లేదని పునరుద్ఘాటించారు.

భావితరాలకు అందని భాషా సౌందర్యం :- నేటి తెలుగుభాష బోధన - పరీక్షలలో ఉత్తీర్ణతే ధ్యేయంగా సాగుతోంది. సాహిత్య విద్యార్థులు సైతం పద్యాలను బట్టీ వేస్తున్నారు. అధ్యాపకులు యథాతథంగా అర్థవివరణ చేస్తున్నారు కానీ, విద్యార్థిలో వివేచన కలిగించటానికి, అంతర్లీనంగా గల కవిహృదయాన్ని అవగతం చేసుకోవటానికి ప్రయత్నం జరగటంలేదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీ సోమసుందర్ ప్రస్తుత స్థితిలో మార్పు వచ్చినపుడే భాషా పునర్వికాసం సాధ్యమవుతుందన్నారు.

అందుకు ఉదాహరణలిస్తూ **"చేర్చుక్కగా నిడ్డ చిన్ని జాబిల్లిచే, సిందూర తిలకంబు చెమ్మగిల్ల............ వింతరంగు లీన. నుపనిషత్తులు బోటులై యోలగింపఁ........... వెలయుఁగాత!"** పద్యంతో చక్కని సమన్వయం చేసారు. ఈ పద్యంలో ఉష్ణగుణానికి ఉద్దీపన కలిగించే సిందూరం శీతలతత్త్వానికి ప్రతీకగా నిలిచే చంద్రవంకలో ఒదిగేటప్పటికి చెమ్మగిల్లినట్లు కవి వర్ణించాడు. **"మను చరిత్రము"**లో ఇష్టదేవతా వందనములోని పై పద్యంలో పెద్దనార్యుని చమత్కృతి వ్యక్తమవుతుంది. పాఠ్య ప్రణాళిక పరిధి దాటి ఇలాంటి విషయాలు కళాశాల, స్నాతకోత్తర స్థాయిలో విద్యార్థులకు బోధించాలన్నారు.

సామాజిక స్వరూప స్వభావాల వాహికగా సాహిత్యం :- సాహిత్యాన్ని ఆ రచనలో పేర్కొనబడిన కాలము నాటి సామాజిక పరిస్థితులు, భౌగోళిక పరిసరాలు, రాజకీయ, ఆర్థిక, స్థితిగతులు వీటన్నిటిని భవిష్యత్ తరాలకు తెలియజేసేదిగా ఆనాటి కవులు రూపొందించారు. అందుకు అందమైన ఉదాహరణగా **"పాండురంగ మాహాత్మ్యం"**లోని ఈ పద్యాన్ని పేర్కొన్నారు శ్రీ సోమసుందర్.



గంగా సంగమ మిచ్చగించునె మదిన్ గావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో నానందముంబొందునే
రంగత్తుంగ తరంగ హస్తముల నారత్నా కరేంద్రుండు నీ
యంగంబంటి సుఖించునేని గుణభద్రా తుంగభద్రానదీ !

నదులన్నీ సముద్రంలో సంగమించడం పరిపాటి. అయితే తుంగభద్రా నది సాగరం వరకూ సాగకుండా కృష్ణలో కలుస్తుంది. భౌగోళికమైన ఈ దృగ్విషయాన్ని కావ్యంలో పొందుపరచిన రామకృష్ణుని ప్రతిభకు తార్కాణంగా పై పద్యం ఆంధ్ర సారస్వతంలో శాశ్వతంగా నిలుస్తుందన్నారు.

అలాగే, నాటి చరిత్రను తెలియజేసే కావ్యంగా **క్రీడాభిరామా**న్ని కూడా పేర్కొంటూ, ఇది అంతటి ఉత్కృష్ట కావ్యమని చాలాకాలం వరకు వారికి తెలియలేదని, దశవిధ నాటక రీతులలో 'వీథి' అనే వర్గీకరణకు సంబంధించిన దీని ఔన్నత్యాన్ని ఏదో సందర్భంలో **శ్రీశ్రీ** చెప్పే వరకు తాను గుర్తించలేకపోయానన్నారు. ఈ వాస్తవ కావ్యం నాటి కార్మిక స్త్రీ, మేదరి స్త్రీ, చాకలి, దొమ్మరి ఇలా వేర్వేరు వృత్తులు, వ్యక్తులతో పాటు కోడిపందాల వంటి వినోదాలను వర్ణిస్తూ నాటి ప్రాచీన సమాజాన్ని మన ముందుంచుతుందన్నారు.

పాత - కొత్త :- పాతదంతా అనుసరణీయమనో, కాదనో తేల్చి చెప్పలేమని, ఈ విషయంలో మనం క్షీర, నీర న్యాయాన్ని పాటించాలన్నారు. నాటి ప్రబంధాలలో కమలాలను, తామరలను, సూర్య చంద్రులను ఇలా అనేక అంశాలను పదే పదే పోల్చుతూ చేసిన వర్ణనలు కనిపిస్తాయి. ఈ ఉపమానాలలో పొసగనివీ ఎన్నో ఉన్నాయి. ప్రాచీన సాహిత్యంలో అలాంటి దృష్టాంతాలను పేర్కొంటూ **వాళ్ళు వ్రాసిన విషయాలలో మనం మనకు అర్థమైనవి మాత్రమే పదే పదే చర్చించుకుంటూ మిగిలినవి విస్మరిస్తున్నాం. ఇందుకు కారణం** మన పరిమిత **జ్ఞానం. ఒకే విషయాన్ని పట్టుకుని వేలాడుతున్నాం. వాళ్ళు తెలిసి** వ్రాసారు, మనం తెలియక విడిచిపెడుతున్నాం అని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంలో చాలా దశాబ్దాల క్రితం వారన్న **"పద్యంలో కొత్త పలుకుబడి అవకాశం లేనంతగా పీచుపీచుగా అయిపోయింది. గణ పూరణం ప్రధానమై భావం వక్ర మార్గం పడుతోంది. నవీన భావనకది పనికిరాదు"** అనే అభిప్రాయాన్ని మళ్ళీ వ్యక్తం చేసారు.

కవి – సంస్కారం :– "ఈ తరంలో తప్పిదాలను హుందాగా అంగీకరించడం; అలాగే, పెద్దల సూచనలను అమలు చెయ్యడం లోపించింది" అంటూ పదేళ్ళ క్రితం జరిగిన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "ఒక సభలో ప్రముఖ పండితుడొకడు విషయాన్ని తనకు నచ్చిన రీతిలో వ్యాఖ్యానిస్తున్నాడు. నా కన్నా చాలా చిన్నవాడు. సాధికారంగా నీది తప్పు అని చెప్పగలిగినా నెమ్మదిగా దగ్గరకు పిలిచి, మీరన్నది సరికాదేమో? దాని అర్థం ఇదేమో? అన్నాను – సరి చేసుకుంటాడని; దానికి అతను ఏమాత్రం లక్ష్య పెట్టకుండా 'చూద్దాం లెండి' అన్నాడు. ఇక ఉండబట్టలేక చివాట్లు పెట్టడం జరిగింది. దానితో అది మరో సభగా, రభసగా మారింది. చివరకు మరొక పెద్దాయన జోక్యం చేసుకుని అతడిని తీవ్రంగా మందలించి 'సోమసుందర్ గారన్నది సత్యం క్షమాపణ కోరండి' అని హితవు చెప్పారు.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే తన ప్రతిభా పాండిత్యాల పట్ల ఆత్మ విశ్వాసం తప్పనిసరి, కాదనను. కానీ అదే రంగంలో ముందుతరం వారు సూచన చేసినపుడు ఆ దిశలో మరింత పరిశోధన, కృషి జరిపినప్పుడే లోపనివారణ సాధ్యమవుతుంది" అంటూ గుర్తు చేసుకున్నారు.

సోమసుందర్ – సంగీతం :– వారి బాల్యంలో అత్యంత సాన్నిహిత్యంతో వ్యవహరించిన మహానుభావులు, ప్రసిద్ధ వైణికులు **తుమరాడ సంగమేశ్వరశాస్త్రి** గారు వారింటి దగ్గరలో ఉండేవారట; శాస్త్రిగారి అవసాన దశలో సోమసుందర్ తల్లిగారు వారికి సేవ చేయమని తరచూ పంపేవారని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. శాస్త్రిగారు వీణను 'అమ్మ' అనే వ్యవహరించేవారని, అంత్య దశలో సోమసుందర్ గారిని పిలిచి **"అమ్మను (వీణను) తీసుకు రా రా, జాగ్రత్త, ఎత్తేస్తావు సుమా"** అన్నారట. కళాకారుడు కళతో అట్టి తాదాత్మ్యాన్ని పొందగలిగి, కళారాధనే జీవన పర్యంతం శ్వాసగా భావించినపుడే చరిత్రలో స్థానం పొందగలరన్నారు.

ఈ సందర్భంలో మనం శ్రీ సోమసుందర్ సంగీత ప్రియత్వాన్ని, ఆ కళపై వారి పరిశోధనను కొంత చర్చించుకోవాలి. బాల్యంలో వీరు **కపిలవాయి రామనాథ శాస్త్రి** గారి గ్రామఫోను పాటలు విని అనుకరించి ఆలపించేవారు. 'గాన కళ' సంగీత పత్రికకు గౌరవ సంపాదకత్వం వహించడమే కాక, వీరు సంగీతంపై వ్రాసిన 50 వ్యాసాలను అందులో ప్రచురించారు. తరువాత ఆ వ్యాసాలు **'హంసధ్వని'** పేరిట వెలువరింపబడి, ఎందరో హిందుస్థానీ, కర్ణాటక సంగీతవేత్తల జీవన విశేషాలను అద్భుతంగా ఆవిష్కరించాయి. అలాగే, వారి భావగీతాలన్నీ **'మనస్సంగీతం'** గా గ్రంథస్థం చేసారు.

ఉత్తమ కవిత్వమంటే :- ఎవరు రాసినది ఓజస్వంతంగా ఉండి, మననం చేసే కొద్దీ రుచులు కలిగిస్తూ ఉంటుందో - అదే ఉత్తమ కవితంటారు సోమసుందర్. మొదటి సారిగా చదువుతున్నప్పుడే పేలవంగానో, వెకిలిగానో, అశ్లీలంగానో తోచి, ఆకర్షవంతంగా ఉండని కవిత, పాఠక హృదయంలో స్మృతి రేఖల్ని విస్తరింప చేయలేదని; ఏది చదువరి హృదయంలో, అతని సంస్కారంలో అంతర్భాగం కాలేదో అది శక్తివంతమైన కవిత ఎన్నటికీ కాజాలదని వారి అభిప్రాయం. కేవలం వైచిత్రితో చమత్కారాన్ని కలిగించే కవిత విషయంలో - అది కలిగించే భావనా తరంగాలూ అల్ప పరిధిలో అంతమవుతాయి. ఉత్తమ భావ మధురమయిన కవిత, చదువరి మనస్సులో స్థిరనివాసం ఏర్పరచుకుంటుందని చెబుతూ; కవితా రచనలో సంవిధానం, భావ పరిమళం లోపిస్తే అది గుణరహిత మవుతుందంటారు. ఒక్కమాటలో, **ఏం చేసినా కవితా మయంగా ఉంటే కవిత్వమే** అన్నది వారి సిద్ధాంతం.

కవిత్వం - శబ్ద సౌందర్యం :- కవిత్వంలో పదాల పొహళింపు విషయానికొస్తే - కవి ఫలానా పదాలు వాడాలి, ఫలానా పదాలు వాడకూడదు అనేది చర్చనీయాంశం కాకూడదని; ఆయా సందర్భాన్ని బట్టి అనుభూతిని బట్వాడా చేయడానికి అర్హమైన పదాలుగా కవికి తోచిన వాటిని ఎన్నిక చేసుకుంటూ ఉంటాడనీ; తాను ప్రయోగించే ప్రతి పదాన్నీ కవి సమానమైన ఆదరణతో ప్రయోగిస్తాడంటారు శ్రీ సోమసుందర్.



కవి - సామాజిక బాధ్యత :- "ఏ కవి అయినా తాను బ్రతికే కాలానికి ప్రతినిధిగా ఉంటాడు. గతం, భవిష్యత్తుల మధ్య వంతెనలా ఉండాలే గానీ అటో ఇటో పారిపోవడం కవి కర్తవ్యం కాదు. వర్తమానంలోనుంచే ప్రజల్ని మేలుకొల్పాలి. అది మూడు కాలాలకీ అతీతంగా ఉండే కాంతి రేఖ. దానిని ఏ కాలానికీ బంధింపజాలము.

సమాజాన్ని కేవలం రచనల ద్వారానే సముద్ధరించగలమన్నది - దురాశ. అయితే మనలాగ ఆలోచించే కొద్దిమంది హృదయాల్లో మన రచనలు చిరవాసం కల్పించుకొని వారి ఆలోచనలకీ, ఆశలకీ దీప్తి కలిగిస్తే చాలు. అలాగే, సమాజ రుగ్మతల్ని సామాజికులే పరిష్కరించుకోవాలి. సామాజికులలో కవి భాగస్వామి; ఆ సామాజిక "మహాక్రతువుకు కవి ఋత్విక్కు ఐతే చాలు" ఇవన్నీ **"సాహిత్యంలో సంశయ కల్లోలం"** గ్రంథంలో 3 దశాబ్దాల పూర్వం శ్రీ సోమసుందర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు. "కవి ఎపుడూ తన రచనలో సమాజాన్ని విడిచి పెట్టరాదు. అలా చేస్తే సమాజం కూడా ఆ కవిని విస్మరిస్తుంది" అన్నది నేటికీ ప్రతి రచయితకూ సోమసుందర్ పదే పదే సూచించే సూత్రం.

* * *

వారి 14వ యేట రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన తర్వాత రాయకుండా గడిపిన క్షణాలన్నిటినీ విషఘడియలుగా భావించే ఈ శతాధిక గ్రంథకర్త సాహితీ క్షేత్రాన, వారి కృషీవలత్వం మరింతగా నిరంతరాయంగా సాగించాలని ఆశిద్దాం.

"
- **'కలలు-కన్నీళ్ళు' - 2005లో; 'పూలు-ముళ్ళు' - 2013లో** ప్రచురితమయ్యాయి.
- క్రీడాభిరామం కావ్యకర్త 'వినుకొండ వల్లభరాయుడు" అని మానవల్లి రామకృష్ణ కవి, చిలుకూరి పాపయ్యశాస్త్రి వంటివారు; అది శ్రీనాథుని కృతిగా వేటూరి ప్రభాకర శాస్త్రి వంటివారు ప్రతిపాదించారు. ఇది ప్రతాపరుద్రుని ఉంపుడుగత్తె "మాచల దేవి' గౌరవార్థం రచింపబడిన వీథి నాటకం.
- 'సాహిత్యంలో సంశయ కల్లోలం' శ్రీ సోమసుందర్ షష్టిపూర్తి సందర్భంగా ప్రచురింపబడింది. "

కొన్ని 'సుందర' సందర్భాలు

శ్రీ సోమసుందర్‌గారిని మొదటిసారి కలిసినప్పుడు, కాసేపు పలకరింపులయ్యాక, మీ రచనలేమైనా వినిపించండి అన్నారు, సౌమ్యంగా. కూర్చున్న చోటనుండి వారికి కాస్త దగ్గరగా జరగానేగానీ ఎందుకో చాలాసేపు మౌనంగానే ఉండిపోయాను. తొంభై ఏళ్ళ కవితో సాహిత్యం గురించి మాట్లాడడం నాకు ఊహకు అందని విషయం, కొంచెం భయంగా ఉంది సార్, అన్నాను నెమ్మదిగా. ముప్పై ఏళ్ల వాడితో సాహిత్యం గురించి మాట్లాడి నాకూ చాలాకాలమైంది, నేనేమైనా భయపడుతున్నానా? మరేం ఫర్వాలేదులెండి అన్నారు, చమత్కారంగా. అలా మొదలైన పరిచయం నెలకోసారి, రెండుసార్లు, చివరకు వారానికోసారైనా కలవడమైంది. నాలుగేళ్ళలో ఓ నలభైగంటల సంభాషణ ఇపుడు మీతో ఈ నాలుగుమాటలూ పంచుకోడానికి అవకాశమిచ్చింది.

***

వెళ్ళగానే చేయందుకుని, కళ్ళువిప్పార్చి ముఖంలోకిచూసి కొండంత ఆనందాన్ని ప్రకటిస్తూ, వచ్చారా! అనేవారు ప్రతిసారీ. గత వారానికి, ఈ వారానికి మనలో మనం గమనించని ఏదో మార్పు చెప్పేవారు. కాస్త నల్లబడ్డారనో, చిక్కారనో, లావెక్కారనో... ముఖ్యంగా జుట్టు గురించి. నేను బైక్‌పై వెళ్ళడంతో చెమటకు, హెల్మెట్ బరువుకు పిఠాపురం వెళ్ళేసరికి జుట్టు బాగా అణిగిఉండేది. ఆయనకు జుట్టు ఎక్కువగా ఉండి విలాసంగా ఎగురుతూ ఉండడం ఇష్టం. ఓ సారి గుండు చేయించుకున్నపుడు, ఎన్ని చివాట్లో. వ్యక్తులకే కాదు పుస్తకాల విషయంలోనూ 'అప్పియరెన్స్'కి ఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. ముఖచిత్రం, శీర్షిక నచ్చకపోతే ముఖం మీదే ఖచ్చితంగా చెప్పేసేవారు.

***

సాహిత్య రంగంలో వివిధ ప్రక్రియలలో బహుముఖంగా కృషి చేయాలి. కొన్నాళ్ళు గడిచాక ఏ ప్రక్రియలో మనకు పట్టు లభించిందో అందులో నిరంతర అధ్యయనంతో విస్తృతంగా వ్రాయాలి. "మిగిలినవన్నీ కాకపోయినా, కవిత్వం, విమర్శ సమాంతరంగా కొనసాగించండి. అపుడు రెండూ ఒకదానివలన మరొకటి మరింత

పదునుదేరతాయి. అయితే ఇవన్నీ ఎందుకోసం అనే ప్రశ్న రానివ్వకండి, సాహిత్యం ఒక నిష్కామకర్మ" – ఇదీ వారి మార్గదర్శనంలోని ముఖ్యాంశం.

***

ఓ వ్యక్తిని అంచనావేసేటప్పుడు అతడి సాహిత్యం, సాహిత్య మూల్యాంకనంలో కవి తాలూకు వ్యక్తిత్వం ఆయనకి అవరోధం అయ్యేవికావు. రెండు విభాగాలనూ అమిశ్రితంగా చూడగలగడం వారి గొప్పదనం. పత్రికలలోను, ప్రత్యక్షంగాను తనతో వాదోపవాదాలు జరిపిన వ్యక్తులకు సైతం "సోమసుందర్ పురస్కారం" అందజేసి గౌరవించారు. తనకెంతో ఆత్మీయులైన వారిని స్నేహితులుగా అభిమానించారు కానీ, కవిత్వం సంతృప్తికరంగా లేకపోతే నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఇలా పుర్వానుభవాలు దృష్టిలోకి రాకుండా; రాగద్వేషాలకతీతంగా సాహిత్య సమీక్షకు సిద్ధం కావడం అరుదైన, ఆదర్శప్రాయమైన, ఆవశ్యకమైన లక్షణం.

***

మిత్రులెవరైనా వారిని కలిసేందుకు పిఠాపురం వస్తున్నారని తెలిస్తే, అవతలి వ్యక్తి ఏ సాహిత్య ప్రక్రియలో కృషి చేస్తున్నారో ఆ ప్రక్రియలో తాను వ్రాసిన పుస్తకాలన్నిటినీ వెతికి బయటకుతీయించి ఆప్యాయంగా అందజేసేవారు. అనువాద సాహిత్యంలో కృషి చేస్తున్న శ్రీ బొల్లోజుబాబాకు "పాబ్లో నెరుడా కవిత్వమూ –జీవితమూ"; పద్య ప్రియులైన శ్రీ కొరుప్రోలు గౌరినాయుడుకి "చైతన్య భారతి"; కథా రచయిత శ్రీ గ.నా.రా.కు "సోమసుందర్ కథలు" శుభాకాంక్షలతో సంతకం చేసివ్వడం నాకు తెలిసిన ఉదాహరణలు.

అలాగే, ఇతర ప్రాంతాలలో జరిగే సాహిత్యసభలకు మిత్రులెవరైనా వెళుతున్నామని చెబితే ఆ సభలో ప్రసంగాంశాలపై తను చేసిన రచనలుంటే ఇచ్చి, ఉపన్యాసకులకు అందజేయమనేవారు. ఇటీవల కాకినాడ బుక్ ఫెస్టివల్‌లో డా॥ఆర్.ఎస్. వెంకటేశ్వరరావు గారు కృష్ణశాస్త్రిపై ప్రసంగిస్తున్నపుడు "కృష్ణశాస్త్రి కవితాత్మ"; సాత్యకిగారు కాకినాడ వచ్చినపుడు "శేషేంద్రజాలం" అలా ప్రత్యేకంగా పంపారు. సాహిత్యసభలకు కేవలం వినడానికి కాకుండా, వెళ్ళేముందు ఆ సందర్భానికి సంబంధించి కొంతైనా చదివితే ప్రసంగాలను, వక్తల అభిప్రాయాలను పూర్తిగా అవగాహన చేసుకోగల సంసిద్ధత కలుగుతుందని సూచించేవారు.

***

వేరే పనులతో వీలుపడక తరచుగా కలిసే మిత్రులు ఓ రెండు ఆదివారాలు వెళ్ళకపోతే సోమవారం ఉదయమే ఫోన్ "ఏవండీ నిన్నంతా ఎదురుచూసాను, ఇలా మరచిపోవడమేనా" అని. ఆ పిలుపు ఎంత ఆత్మీయంగా ఉండేదంటే ఒక్కోసారి వర్కింగ్‌డేస్‌లో ఉదయాన్నే వెళ్ళి ఓ గంట కూర్చుని మళ్ళీ పరుగు పరుగున ఆఫీస్‌కి వచ్చేవాణ్ణి, ఎందుకంటే మనరాకను అంతగా కోరుకునే మహనీయుల సాన్నిహిత్యం మళ్ళీ లభిస్తుందని ఆశించలేం. కొన్ని సౌభాగ్యాల కాలపరిమితి స్వల్పంగానే ఉంటుంది కదా !

***

సో.సు. లో అబ్బురపరిచే అంశాలలో వారి జ్ఞాపకశక్తి ఒకటి. మాటల మధ్యలో ఎప్పుడైనా కవి పేరో, పుస్తకం పేరో వారికి గుర్తురాకపోతే చాలా బాధపడేవారు. అది జ్ఞప్తికి వచ్చేవరకూ స్థిమితపడేవారు కాదు. ఈ మధ్య మెమరీ పోయిందండి అనేవారు చాలా బాధగా. 'పోయిందనే విషయం గుర్తుంది కదా! అంటే జ్ఞాపకశక్తి ఉన్నట్టే' అనేవాణ్ణి సరదాగా. వారి గ్రంథాలపై వ్యాసాలు వ్రాస్తున్నపుడు ముఖ్యమైనవన్నీ గుర్తుచేసుకుని చెప్పి, వాటిపై వ్రాయమన్నారు. ఆయా గ్రంథాల నేపథ్యాన్ని, సంఘటనలను, నెలల, తేదీలు, ప్రదేశాలతో సహా చెప్పారు.

***

పారిస్‌లో "నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజెస్ అండ్ సివిలైజేషన్" విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీ డేనియల్ నెజర్స్ మన జానపద కళారూపాలపై పరిశోధన చేశారు. వారు పెద్దాపురం, యానాం ప్రాంతాలకు తరచుగా వస్తుంటారు. వీరు చక్కని తెలుగు మాట్లాడడమే కాకుండా మన పద్యాలను ఫ్రెంచిలోనికి అనువదించారు. ఓసారి వారి పర్యనటలో భాగంగా సో.సు.ని కలిసేందుకు పిఠాపురం వచ్చారు. వారిని పరిచయం చేసిన వ్యక్తి "విదేశీయుడు" అని ప్రత్యేకించి చెప్పలేదు. పదం, పదం పట్టిపట్టి విడివిడిగా మాట్లాడుతున్న వారిని "ఏవిటా మాట్లాడడం, ఫ్యాషన్ అనుకొంటున్నావా?" అని కోప్పడ్డారు సో.సు. అక్కడున్న వాళ్ళం ఆయన ఫ్రెంచ్ దేశీయులని చెప్పాం. వెంటనే, ఎటువంటి భేషజాలూ లేకుండా వారి చేతులు పట్టుకుని 'క్షమించండి తొందరపడ్డాను' అని, ప్రక్కన కూర్చోబెట్టుకుని, పరిశోధనా విషయాలు అన్నీ అడిగి తెలుసుకొన్నారు. అంతపెద్ద వ్యక్తి అలా పొరపాటును సులువుగా అంగీకరించడం అంతచిన్న విషయంకాదేమో!

***



సో.సు లఘుకవితా సంపుటి “చంద్రభాగ” సమీక్షలో వారి సమకాలీనులైన ఓ సుప్రసిద్ధ కవి వాక్యాన్ని వీరి కవితాపాదం గుర్తుచేస్తోందని వ్రాసాను. “మీ అభిప్రాయాన్ని తప్పుపట్టను కానీ, నేను అతడిని కవిగా అంగీకరించలేను” అన్నారు. అయ్యో, అంగీకరించకపోవడమేమిటి? తెలుగు సాహిత్యంలో వారికో ప్రత్యేక స్థానముంది, పైగా ఆయన్ని అమితంగా ఆరాధించే లక్షలాది పద్యప్రియులలో నేనూ ఒకణ్ణి అన్నాను. “ఆయన కృషిని, వారికున్న ప్రసిద్ధి నేను తక్కువ చేయను, వ్యక్తిగా నాకెంతో ఆత్మీయుడు కూడా. సెలయేటిలో నడుస్తూ ఉంటే ఎన్ని గంటలైనా ఉల్లాసంగా శ్రమ తెలియకుండా గడచిపోతాయి. తీరా బయటకు వచ్చి చూస్తే ఇన్ని గంటల ప్రయాణంలోనూ పాదాలు తప్ప మోకాళ్ళు కూడా తడవలేదని తెలుస్తుంది. శరీరమంటే కేవలం పాదాలవరకే కాదు. లోతు లేని ప్రయత్నాన్ని నేను ప్రశంసించలేను. ఈ మాటలు నేరుగా వారితోనే చెప్పాను” అన్నారు. నిజానికి ఈ సంభాషణ తరువాత ఆ కవిపై నా ఆరాధన ఏమాత్రం తగ్గలేదు. కానీ, వారు చెప్పిన కారణం మాత్రం ఆలోచింపదగినదేననిపించింది.

***

ఐదేళ్ళు వారికి సేవలందించిన ‘మహాలక్ష్మి’ వారి చివరి దశలో ఆమె ఆరోగ్యం బాలేక మానేసినపుడు, ఆ స్థానంలో మరో అబ్బాయి వచ్చినా ఎక్కువకాలం కొనసాగలేదు. ఆ తరువాత వచ్చిన ‘నాగులు’ మరలా ఆయనకు చేరువకాగలిగాడు. అలాగే, వ్యక్తిగత సహాయకునిగా, లేఖకునిగా వ్యవహరించిన శ్రీ మన్మథరావు ఉద్యోగంలో చేరతానన్నపుడు వారు అడ్డుచెప్పలేదు. అయితే, ఈ రెండు సందర్భాలలోనూ తన మనసెరిగి మసలుకొనే వ్యక్తులు దూరమవుతున్నారని ఆత్మీయుల దగ్గర బాధపడ్డా పైకిమాత్రం నిబ్బరంగానే ఉన్నారు. పిఠాపురంలో వారింటి పరిసరాలు, వచ్చిపోయే సాహితీ మిత్రులతో సందడిగా ఉండే వాతావరణం వారికి విడిచిపెట్టలేనంత ఇష్టం. అయినా, వైద్యంకోసం కాకినాడలో అబ్బాయి ఇంట ఉండవలసివచ్చినపుడు సానుకూలంగానే వ్యవహరించారు. ఇలా పరిస్థితులకు అనుగుణ్యత పొందడం ఆ వయసులో అందరికీ సాధ్యం కాదేమో!

***

ఓసారి వారి అబ్బాయి శశికాంత్, డా॥ సీతారామస్వామిగారు, మన్మథరావు గారు, నేను వారితో కూర్చుని మాట్లాడుతున్నాం. అలా అలా విషయం స్వీయ చరిత్రలవైపు మళ్ళింది. శ్రీపాద వారిది, టంగుటూరి ప్రకాశం గారిది, తిరుమల రామచంద్ర గారిది, సామల సదాశివ గారిది..... ఇలా చాలాసేపు మాట్లాడుకున్నాక వారి స్వీయచరిత్ర వైపు చర్చ తిరిగింది. కాసేపటికి మేమంతా ఎదురుగా సో.సు. ఉన్నారనే విషయాన్ని మరిచిపోయాం. వాస్తవ సంఘటనలే అయినా, కొన్ని విషయాలను గ్రంథంలో ప్రస్తావించకుండా ఉంటే బావుండేదని నేను, శ్రీ శశికాంత్; లేదు అలాగే రాయాలని సీతారామస్వామిగారు; కాస్త తటస్థంగా మన్మథరావుగారు... ఇలా ఓ అరగంట గడిచింది. మా చర్చను ఆపి "సార్ ఇంతకీ మీరేమీ చెప్పడంలేదే?" అన్నాం. "చర్చ మొదట్లో ప్రస్తావించిన పుస్తకాలకు నేనూ మీలాగే పాఠకుణ్ణి. అందుకే నా అభిప్రాయాల్ని పంచుకున్నాను. కానీ నా విషయానికి వచ్చేసరికి న్యాయ నిర్ణయం చేసే అధికారం నాకు లేదు. అయినా ఇన్నేళ్ళ తరువాత ఆ విషయాల గురించి మీ నలుగురూ అంత లోతుగా మాట్లాడుకుంటున్నారంటే రచయితగా నా కృషి, స్వీయచరిత్రగా నా పుస్తకం విజయవంతమయ్యాయని అర్థం. నాకది చాలు" - ఇదీ వారి సమాధానం. ఒకనాటి సోమసుందర్ మాత్రమే పరిచయమైన వారికి, ఆయనలో ఇంతటి సంయమనం ఊహకు అందదు.


***

పూలు-ముళ్ళు, కలలు-కన్నీళ్ళతో జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్న సో.సు. మరికొంత కాలం ఉండుంటే బావుండునేమో అనిపించడం సహజం. కాని, ఇక ఏమీ మిగలలేదనిపించేలా, ఇక ముందెవ్వరూ రాయలేనంతగా రాసేసారు. అతిశయోక్తి కాదనుకుంటే రాయడం మాట అటుంచి చదవడానికే ఓ జీవితకాలం సరిపోనంతగా రాసేసారు. ఇదంతా పనికట్టుకుని కాదు, బ్రతుకు ఈ పనికోసమే అన్నట్లు రాసారు. సృజన కోసం వెచ్చించని క్షణాలన్నీ విషఘుడియలుగానే భావించిన ఆ 'అమృతమూర్తి'తో నాకు లభించిన ఈ పరిచయ భాగ్యం దేని ఫలితం? ఉంటే, ఇలాంటి మాటలు అంటే ఆయనొప్పుకోరని తెలిసినా "పూర్వజన్మ సుకృతం" అని కాక మరేమనగలను.

***





ప్రస్తావించిన గ్రంథాలు...













చంద్రభాగ


(ఐదు దీర్ఘకావ్యాలు
డా॥ ఆవంత్స సోమసుందర్



సౌభాగ్య సంధ్య


జీవనలిపి
సంపూర్ణ కావ్యం
డా॥ సోమసుందర్ ఆవంత్స





మా ఊరు
మా రిం ది


యువామంత్రణ


దోనాపాలా
సోమసుందర్


కవిత్వం
ఆవంత్స
సోమసుందర్


కాలానికి కవిత్వం
కాపలా దీపం


పూలు - ముళ్ళు


కలలు - కన్నీళ్ళు
డా॥ ఆవంత్స సోమసుందర్



Avadhanula Mani Babu
M.Sc., B.Ed.,
99481 79437
avadhanulamb@rediffmail.com

శ్రీ మణిబాబు లోగడ ఒక సాహిత్య విమర్శా గ్రంథాన్ని,
ఒక కవితా సంపుటిని ప్రచురించాడు. గతానుగతికత్వం పోకార్చి,
స్వీయ కవితా ముద్రను ప్రకటించుకున్నాడు.
ఇప్పుడీ పుస్తకంతో నూతన పరిధులు స్పర్శిస్తున్నాడు,
స్థాపిస్తున్నాడు, సాధిస్తున్నాడు.

* * *

ఎవరి సాహిత్యం మీద వాళ్ళు ఏ విధమైన అంచనాలూ వేసుకోలేరు.
వేరొకరు విపులీకరించినప్పడే ఆ అభివ్యక్తులకు ప్రాముఖ్యత లభిస్తుంది.
ఆలోచనలు ప్రసరిస్తాయి, ఔగాముల పరిశీలన మరోసారి
కేంద్రీకృతమౌతుంది.

* * *

మణిబాబు ఈ గ్రంథాన్ని చాలా నిశితంగా రాసాడు.
వాల్యూమ్ కోసం కాకుండా వేల్యూ కోసం దృష్టి సారించాడు.
ఇతనికి పరిశీలనా నైశిత్యం ఉంది. భావాభివ్యక్తీ ఉంది.
అనుభవం, సమభావుకత్వం విడివిడిగా పెంపెసలారుతున్నాయి.
ఈ గ్రంథము, శీర్షిక నాకెంతగానో నచ్చాయి.
అందుకే అక్కున చేర్చుకుని, లౌక్యము, ధ్వనీ లేకుండా
నిర్మల కరస్పర్శతో అభినందిస్తున్నాను.

\- డా॥ ఆవంత్స సోమసుందర్